# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 సంచిక : 332 సోమవారం 28 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vnteluguday@gmail.com



BSBD ఖాతా




కనీస బ్యాలెన్స్ అవసరం లేదు,
గరిష్ఠ ప్రయోజనాలు పొందండి!

బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్
ఇప్పుడు మరిన్ని కొత్త సదుపాయాలు,
ఎలాంటి ఛార్జీలు లేకుండా

- కనీస బ్యాలెన్స్ అవసరం లేదు
- బ్యాంక్ ఖాతా తెరవడానికి ప్రారంభ డిపాజిట్ అవసరం లేదు
- ఉచిత ఏటీఎం-కమ్-డెబిట్ కార్డ్
- ఉచిత ఇంటర్నెట్ & మొబైల్ బ్యాంకింగ్ సదుపాయాలు
- ఉచిత పాస్‌బుక్ & చెక్‌బుక్
- ఇప్పటికే ఉన్న బ్యాంక్ సేవింగ్స్ ఖాతాను సులభంగా BSBD ఖాతాగా మార్చుకునే సదుపాయం




క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి

మరిన్ని వివరాల కొరకు
సందర్శించండి https://rbikehtahai.rbi.org.in/bsbd-account.html

అధికారిక వాట్సాప్ నం. 99990 41935 / 99309 91935

ప్రజా హితార్థం జారీచేసినవారు
भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

# బోయింగ్ విమానాల్లో సాఫ్ట్ వేర్ లోపాలు

ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ తమ 737 మ్యాక్స్ విమానాల్లో మరో సాఫ్ట్‌వేర్ లోపాన్ని గుర్తించింది. దీని ప్రభావం భారత్‌లో ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు నడుపుతున్న సుమారు 96 విమానాలపై పడనుంది. ల్యాండింగ్ సమయంలో ఒకసారి విఫలమై, రెండోసారి వేరే మార్గంలో ప్రయత్నించే క్రమంలో (మిస్డ్ ల్యాండింగ్ అప్రోచ్) ఆటోమేటెడ్ ఫ్లైట్ గైడెన్స్ సిస్టమ్ పనిచేయడం ఆగిపోయే అవకాశం ఉందని బోయింగ్ వెల్లడించింది. పీటీఐ తన కథనంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ సమస్యపై బోయింగ్ గత నెలలోనే అన్ని 737 ఆపరేటర్లను అప్రమత్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పైలట్లు ఆటోమేషన్ తగ్గిపోవడాన్ని గమనించవచ్చని, దీన్ని సురక్షితంగా ఎలా ఎదుర్కోవాలో ఇప్పటికే ఉన్న విధానాలను బలోపేతం చేస్తూ మార్గదర్శకాలను పంచుకున్నట్లు తెలిపింది.



తాత్కాలిక నివారణ చర్యగా, 'మిస్డ్ అప్రోచ్' తర్వాత సిస్టమ్‌ను రీసెట్ చేయాలని ఆపరేటర్లకు సూచించింది. శాశ్వత పరిష్కారం కోసం తమ ఇంజనీర్లు ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను అభివృద్ధి చేస్తున్నారని బోయింగ్ ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. భారత్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద సుమారు 53, ఆకాశ ఎయిర్ వద్ద 43 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ఈ సమస్యపై ఆకాశ ఎయిర్ స్పందిస్తూ.. తమ విమానాల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని, నిర్దేశిత విధానాలు, నియంత్రణ సంస్థల నిబంధనల ప్రకారమే సర్వీసులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా బోయింగ్ 2,400కు పైగా 737 మ్యాక్స్ విమానాలను డెలివరీ చేసింది. మరోవైపు, ఎయిర్‌బస్ సంస్థకు చెందిన కొన్ని ఏ321నియో విమానాల ఫ్యూసిలేజ్‌పై సర్ఫేస్ ప్రొటెక్షన్ కోటింగ్‌కు సంబంధించి నాణ్యతా లోపాన్ని గుర్తించినట్లు కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు. భారత్‌లో ఇండిగో సంస్థ నడుపుతున్న సుమారు డజను విమానాల్లో ఈ సమస్య ఉన్నట్టు తెలుస్తోంది.

# ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

**జనగణనపై ప్రజలకు పిలుపు**

'మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు



వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోధేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24ఇ7 సోలార్ విలేజ్?గా మారడాన్ని ఆయన అభినందించారు. అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోధేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో ఒక్కసారైనా మోధేరాను సందర్శించాలని ఆయన కోరారు. మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. దిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి**

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని

# అల్లకల్లోలంగా సముద్రం.. అప్పుడే స్విమ్మింగ్ చేయడం నాకిష్టం

"సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అందులో ఈదడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అల్లకల్లోలం కూడా ఒక రకమైన ప్రశాంతతేనని అది మనకు నేర్పుతుంది" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ఆయన ఆ వ్యాఖ్యలను ఏ ఉద్దేశంతో చేశారనేది స్పష్టంగా పేర్కొనలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన సమస్యలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారన్న అంశంపై రాజకీయ దుమారం మధ్య ఈ పోస్ట్ వెలువడింది.

**సీఈసీ తన పదవికి రాజీనామా చేలియాలి!**

మరోవైపు, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కేరళ మాజీ ప్రధాన కార్యదర్శికి బీజేపీ టికెట్ ఆఫర్ చేశారన్న వార్తలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సీఈసీ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయటం దారుణమన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. "ఇది పూర్తిగా చట్టవిరుద్ధం, పూర్తిగా అనైతికం. మన ఎన్నికల వ్యవస్థలో, ఎన్నికలను నిర్వహించే సంస్థల్లో అత్యున్నత స్థాయిలో ఉన్న ఈ వ్యక్తులకు పార్టీల పట్ల పక్షపాతం ఉందని ఇది స్పష్టంగా చూపిస్తోంది. వారికి పార్టీ పక్షపాతం ఉండటమే కాకుండా, ఆయా పార్టీల కోసం వారు క్రియాశీలకంగా ప్రచారం కూడా చేస్తున్నారు. అలాంటప్పుడు వారు నిష్పక్షపాతంగా ఎన్నికలను ఎలా నిర్వహించగలరు? ఈ పెద్దమనిషి చేసిన పూర్తిగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన పనుల పరంపరలో ఇది ఒకటి మాత్రమే. కాబట్టి వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. దేశవ్యాప్తంగా నిరసనలు



జరుగుతున్నాయి. దిల్లీతో పాటు ప్రతి జిల్లాలో మేం ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపాం."

**సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారు!**

మరోవైపు, ఎస్ఐఆర్ విషయంలో జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించిన రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది నెలలుగా ఇతర ఎన్నికల కమిషనర్ల ప్రమేయం లేకుండా, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. స్థానిక అధికారులను పక్కనపెట్టి దిల్లీలోని జు.జ.× చీజు ద్వారానే ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేపట్టారని, ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండానే ఫారమ్-6లో మార్పులు చేశారని ఆయన విమర్శించారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీకి నేర విచారణ నుంచి మినహాయింపు ఉన్నందున, చట్టబద్ధమైన రక్షణ లేని జుజ× చీజు నిర్వాహకురాలు సీమా ఖన్నాపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. చట్టవిరుద్ధంగా సాగిన ఈ నిర్ణయాల నేపథ్యంలో గత జూన్ నుంచి ఏప్రిల్ వరకు జరిగిన ఎన్నికలను రద్దు చేసే అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించాలని సిబల్ విజ్ఞప్తి చేశారు.

**సీజేపీకి మద్దతు తెలిపిన సోనమ్ వాంగ్‌చుక్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న 'కాక్రోచ్ జనతా పార్టీ' తలపెట్టనున్న ఆందోళనకు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. దేశంలో జవాబుదారీతనాన్ని, ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచేందుకు జరిగే ప్రయత్నాలకు తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ ఉద్యమంలో తాను భౌతికంగా పాల్గొనకపోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ అనేది అత్యంత కీలకమని వాంగ్‌చూక్ పేర్కొన్నారు. ఆ ప్రక్రియే దెబ్బతింటే, ఇక ప్రజాస్వామ్యానికి విలువేముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు తామిచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాలన్నారు. లద్దాఖ్‌కు 6వ షెడ్యూల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వాంగ్‌చూక్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను ఆయన పట్టించుకోలేదన్న మీడియా కథనాలతో దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘంలో జవాబుదారీతనం కోరుతూ అక్టోబర్ 2న సీజేపీ ముంబయిలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది.

# లాటరీ గెలవలేదని షాప్ ఓనర్‌పై దాడి

లాటరీ టికెట్ కొన్నారు. అదృష్టం కలిసి రాలేదు. ప్రైజ్ రాలేదని కోపంతో షాప్ ఓనర్‌పైనే దాడి చేశారు. కేరళలో జరిగిన ఆ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఇదే కేరళలో తాజాగా ఏకంగా రూ.30 కోట్ల థిరువోణం బంపర్ లాటరీ విజేత ఎవరో కూడా ఇంకా బయటకు రాలేదు. ఇంత పెద్ద మొత్తం గెలిస్తే ఏం చేయాలి టికెట్‌ను ఎలా భద్రపరచాలి డబ్బు పొందేందుకు ఎలాంటి పత్రాలు కావాలి తెలుసుకుందాం. కేరళలోని వయనాడ్ నంబియార్‌కున్నులో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, తమిళనాడుకు చెందిన శివకుమార్ తరచూ వయనాడ్‌కు వచ్చి లాటరీ టికెట్లు కొనుగోలు చేసేవాడు. అయితే తాను కొన్న టికెట్లలో ఒక్కదానికీ ప్రైజ్ రాలేదని అసంతృప్తిగా ఉన్నాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో లాటరీ షాప్‌కు వచ్చిన శివకుమార్, టికెట్ల విషయంలో విక్రేత వినిత రాజేశ్‌తో గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత కోపంలో ఆమె మెడపై కత్తితో దాడి చేయడంతో పాటు తలకు కూడా గాయాలు చేసినట్లు చెప్పారు. స్థానికులు వెంటనే జోక్యం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వినితను సుల్తాన్ బతేరి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. పోలీసులు శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**రూ.30 కోట్ల విజేత ఎక్కడ?**

ఇదిలా ఉంటే కేరళ లాటరీ చరిత్రలోనే అత్యధికంగా ప్రకటించిన రూ.30 కోట్ల థిరువోణం బంపర్ ప్రైజ్ విజేత మాత్రం ఇంకా బయటకు రాలేదు. ఈ ఏడాది థిరువోణం బంపర్ లాటరీ టికెట్ నంబర్ యా 360615. ఆ టికెట్ కన్నూర్ జిల్లా చక్కరకల్‌లోని ముత్తు లాటరీ ఏజెన్సీ ద్వారా విక్రయమైంది. ఏజెన్సీ సబ్‌ఏజెంట్ అనీష్ ఎం.వి. ఈ టికెట్‌ను విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. ఇదే ఏజెన్సీ గత క్రిస్మస్-న్యూ ఇయర్ బంపర్ విజేత టికెట్‌ను కూడా విక్రయించింది. టికెట్ విక్రయించిన ఏజెన్సీకి 12 శాతం కమిషన్‌గా సుమారు రూ.3.60 కోట్లు వచ్చే అవకాశం ఉంది. అయితే అసలు రూ.30 కోట్ల విజేత మాత్రం ఇప్పటివరకు లాటరీ అధికారులను సంప్రదించలేదు. విజేత ఒరిజినల్ టికెట్‌తో 30 రోజుల్లోగా క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. లాటరీ గెలిచిన వెంటనే ఉత్సాహంలో టికెట్‌ను ఎక్కడపడితే అక్కడ పెట్టడం మాత్రం చేయకూడదు. ముందుగా టికెట్‌ను భద్రంగా ఉంచుకోవాలి. టికెట్ వెనుక భాగంలో పేరు, చిరునామా, సంతకం రాయాలని లాటరీ శాఖ సూచనలు చెబుతున్నాయి. ఆ తర్వాత టికెట్ ముందు, వెనుక భాగాలను స్పష్టంగా కనిపించేలా ఫొటోకాపీలు తీసుకోవడం మంచిది. ఒరిజినల్ టికెట్ చినిగిపోకుండా, తడవకుండా జాగ్రత్తగా ఉంచాలి. ప్రైజ్ గెలిచిన టికెట్‌ను గుర్తింపు పత్రాలతో కలిసి ప్రభుత్వ లాటరీ కార్యాలయం లేదా నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులో సమర్పించవచ్చు. ప్రభుత్వ గెజిట్‌లో వచ్చిన ఫలితాలను పరిశీలించి, నిర్ణీత సమయంలోపు టికెట్‌ను సమర్పించాలి.

## భారత రైల్వేలో కొత్త శకం




భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (రాచీ+) ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ (ఙూజ) ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు. రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ.11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది. ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ.1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ.700 కోట్లతో నిర్మించిన ఔూ+-12 లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్-పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

## ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు మినహాయింపు

తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా వర్గీకరిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా +.ూ. వీం.చీశీ.57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు. ఈ నిర్ణయం వల్ల... ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు. సాధారణంగా శాంతిభద్రతల విభాగం ప్రభుత్వ పరిపాలనలో అంతర్భాగం. దానిని ఒక గూఢచార సంస్థగా వర్గీకరించి ఆర్టీఐ నుంచి మినహాయించడం అనూహ్యమైన పరిణామం. ఈ చర్యతో పౌరులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు కీలకమైన సమాచారాన్ని తెలుసుకునే హక్కును కోల్పోతారు. ఇది ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుందని, అధికార దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం తమిళనాడులో తీవ్ర చర్చకు దారితీసింది.

## 'మేక్ ఇన్ ఇండియా'తో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధించాలి

చిన్న స్క్రూల నుంచి చిప్స్, పూర్తిస్థాయి ఆయుధ వ్యవస్థల వరకు అన్నీ దేశంలోనే తయారు చేయడం ద్వారా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సాధిస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశం ప్రస్తుతం అదే దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఈరోజు



జరిగిన 'ఎన్డీటీవీ' డిఫెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, 'మేక్ ఇన్ ఇండియా' విధానం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించారు. "మన సిద్ధాంతం చాలా సులభం. ఇక్కడ తయారు చేయగలిగిన వస్తువును బయట నుంచి ఎందుకు కొనుగోలు చేయాలి? దీన్నే మనం స్వావలంబన అంటాం. చిప్స్ నుంచి నౌకల వరకు, స్క్రూల నుంచి సంపూర్ణ ఆయుధ వ్యవస్థల వరకు దేశీయంగా తయారుచేయడం ద్వారానే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధ్యమవుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ సన్నద్ధతపై మాట్లాడుతూ, రక్షణ రంగంలో ఇప్పటికే కీలకమైన, నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. "మేము కేవలం ప్రస్తుత అవసరాలను తీర్చడానికే పరిమితం కాలేదు. స్వావలంబన, భవిష్యత్ లక్ష్యాలతో ముందుకు వెళుతున్నాం. రక్షణ రంగం వేగం పుంజుకుంది" అని ఆయన వివరించారు. టెలికాం రంగంలో 2జీ నుంచి 5జీకి మారిన వృద్ధిని ఉదాహరణగా చూపుతూ, యుద్ధ తంత్రాలు కూడా ఇప్పుడు 5వ తరంలోకి ప్రవేశించాయని అన్నారు. "ప్రస్తుతం 5వ తరం యుద్ధాలపై చర్చ జరుగుతోంది. మారుతున్న ఈ వాతావరణంలో ప్రధానమంత్రి నాయకత్వంలో మన రక్షణ సన్నద్ధత కూడా అభివృద్ధి చెందుతోంది. స్వదేశీ క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం. కాంటాక్ట్, నాన్-కాంటాక్ట్, కైనెటిక్, నాన్-కైనెటిక్ యుద్ధాల్లో మన సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నాం" అని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాలు 'మల్టీ-డొమైన్ ఎన్విరాన్‌మెంట్'లో జరుగుతాయని, పూర్తిగా టెక్నాలజీ ఆధారితంగా ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. "ఆధునిక సైనికుడు కేవలం సైనికుడు మాత్రమే కాదు. వారు మల్టీ-డొమైన్‌లో పనిచేస్తారు. భవిష్యత్తులో యుద్ధ క్షేత్రం టెక్నాలజీతో నడుస్తుంది. టెక్నాలజీలో ఏ దేశం ముందుంటుందో, యుద్ధంలోనూ అదే దేశం ముందుంటుంది. మన రక్షణ వ్యూహం భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 332 | సోమవారం 28 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కొత్తగా 41 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

## నేటి నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ

### దరఖాస్తుకు రూ.లక్ష రుసుము



హైదరాబాద్

క్యూర్ ఏరియా పరిధిలో 2బీ బార్లు 14, మిగిలిన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 27 కలిపి మొత్తం 41 బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రూ.లక్ష రుసుముతో ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. క్యూర్ ఏరియా, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, మున్సిపాలిటీల్లో శివారు గ్రామాల విలీనంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్తగా 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. గ్రేటర్ హైదరాబాద్ జిల్లాలోని 2బీ బార్లకు రూ.44 లక్షలు, నిజామాబాద్ బోధన్ బార్‌కు రూ.42 లక్షలు, మిగిలిన 2బీ బార్లకు రూ.30 లక్షలు సంవత్సరానికి ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి - మిగతా3లో

### ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు

# మినహాయింపు..

- విజయ్ సర్కార్ సంచలన నిర్ణయం
- తమిళనాడులో కీలకమైన పబ్లిక్ (లా అండ్ ఆర్డర్) విభాగానికి ఆర్టీఐ నుంచి మినహాయింపు
- ఇంటెలిజెన్స్, భద్రతా సంస్థగా వర్గీకరిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్
- సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఈ వివాదాస్పద నిర్ణయం తీసుకుంది
- మత ఘర్షణలు, కస్టడీ మరణాల సమాచారంపై ఇకపై గోప్యత



### 'మేక్ ఇన్ ఇండియా'తో

# వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధించాలి

- చిప్స్ నుంచి ఆయుధాల వరకు.. ఇక్కడే తయారు చేయగలిగితే బయట కొనడం ఎందుకు?: రాజ్‌నాథ్ సింగ్
- భవిష్యత్ యుద్ధాలు టెక్నాలజీ ఆధారితంగానే ఉంటాయన్న రాజ్‌నాథ్
- 5వ తరం యుద్ధాలకు భారత్ సిద్ధమవుతోందన్న రక్షణ మంత్రి
- రక్షణ రంగంలో కీలకమైన నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని వెల్లడి




# బరాజ్‌ల పునరుద్ధరణ ఖర్చు సర్కారుదే!



- వ్యయం భరించేందుకు నిర్మాణ సంస్థల విముఖత
- తొలుత వ్యయం తామే భరించాలని సర్కారు యోచన
- ఆ తర్వాత నిర్మాణ సంస్థల నుంచి రికవరీకి చర్యలు
- మేడిగడ్డ 7వ బ్లాక్ తొలగించాలా? ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మార్చాలా?
- ప్రభుత్వ పరిశీలనలో రెండు ప్రత్యామ్నాయాలు
- వచ్చే వానాకాలం నాటికి అన్నారం, సుందిళ్లను సిద్ధం చేసే యోచన

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది! పునరుద్ధరణ ప్రక్రియలో మరింత జాప్యం జరగకుండా నివారించడానికి ప్రభుత్వం ఈ మేరకు యోచిస్తోంది. వాస్తవానికి బరాజ్‌ల పునరుద్ధరణ వ్యయాన్ని పూర్తిగా నిర్మాణ సంస్థలే భరించాల్సి ఉంటుందని - మిగతా3లో




# భారత రైల్వేలో కొత్త శకం


- దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ రైలును ప్రారంభించిన అమిత్ షా
- దేశంలో తొలిసారిగా పరుగులు తీసిన ఎల్ఎన్‌జీ రైలు
- సబర్మతిలో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించే టెక్నాలజీ
- భారీగా ఆదా కానున్న ఇంధన ఖర్చు, తగ్గనున్న కాలుష్యం
- ఈ పర్యటనలో రూ.1542 కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

# అల్లకల్లోలంగా సముద్రం అప్పుడే స్విమ్మింగ్ చేయడం నాకిష్టం

- ఎస్ఐఆర్ దుమారం మధ్య రాహుల్ ఎక్స్ పోస్టు
- సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలన్న ప్రియాంక గాంధీ
- సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించిన కపిల్ సిబల్



# ఆశలు రేకెత్తించిన సెప్టెంబర్ వానలు



- పదేళ్లలో అతి తక్కువ వానలు.. రుతుపవనాల సీజన్‌లో 17% లోటు వర్షపాతం
- రాష్ట్రంలో సగటు సాధారణ వర్షపాతం 74.06 సెం.మీ.. ప్రస్తుతం నమోదైంది 61.53 సెం.మీ.
- దక్షిణాది జిల్లాల్లో తీవ్ర లోటు.. జోగులాంబ గద్వాలలో అత్యధికంగా 39% తక్కువ
- పంటల దిగుబడిపై నీలినీడలు..
- వర్షాల మధ్య విరామంతో శాస్త్రవేత్తల మల్లగుల్లాలు
- ఖరీఫ్ సీజన్‌లో 55 లక్షల ఎకరాల్లో వరి
- ఉత్తర తెలంగాణకు ఊరట

హైదరాబాద్


ఈసారి నైరుతి నిండా ముంచింది. రుతుపవనాలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. గత పదేళ్లలోనే అత్యంత తక్కువ వర్షాలు నమోదైన సీజన్‌గా మిగిలింది. ఎల్‌నినో ప్రభావం, హిందూ మహా సముద్రంలో ఉష్ణోగ్రతల వ్యత్యాసంతో రాష్ట్రంలో తక్కువ వర్షాలు నమోదైనట్లు వాతావరణ శాఖ చెబుతోంది. మొత్తం మీద ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు నుంచి ఇప్పటివరకు వర్షపాతం గణాంకాలను పరిశీలిస్తే ఈ ఏడాది అతి తక్కువ వర్షాలు కురిశాయి. అయితే జూలైలో దాదాపు సాధారణ వర్షపాతం (ఎంత కురిసే అవకాశం ఉందో అంత) నమోదు కాగా, ఆగస్టులో ఏకంగా 38 శాతం లోటు ఏర్పడింది. - మిగతా3లో



## ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం

- 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తుచేసిన ప్రధాని మోదీ
- 138వ మన్ కీ బాత్ కార్యక్రమం
- 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ
- భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని వెల్లడి
- జనగణనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపు

# ఓట్ల చోరీతో బీజేపీ పట్టుబడింది




- కేంద్ర ఎన్నికల కమిషనర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు: మంత్రి ఉత్తమ్
- దేశం కోసం కష్టపడుతున్న రాహుల్‌ను ప్రధాని చేసేందుకు ప్రజలు చూస్తున్నారు
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

హుజూర్‌నగర్

కేంద్రంలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతూ పట్టుబడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ సంస్థ కాదని.. ఓటు హక్కు ఏ రాజకీయ పార్టీకి చెందిన ఆస్తి కాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ, - మిగతా3లో

# బోయింగ్ విమానాల్లో సాఫ్ట్ వేర్ లోపాలు..

- బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో కొత్త సాఫ్ట్‌వేర్ లోపం గుర్తింపు
- భారత్‌లో ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 96 విమానాలపై ప్రభావం
- ల్యాండింగ్ సమయంలో ఆటోమేటెడ్ గైడెన్స్ సిస్టమ్ ఆగిపోయే అవకాశం
- భద్రతకు ముప్పులేదని, శాశ్వత పరిష్కారంపై పనిచేస్తున్నామని తెలిపిన బోయింగ్



# బరాజ్‌ల పునరుద్ధరణ ఖర్చు సర్కారుదే!

-మొదటిపేజీ తరువాయి

గతంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. పునరుద్ధరణ బాధ్యతలు స్వీకరించి వ్యయాన్ని పూర్తిగా భరించాలంటూ ప్రాజెక్టు ఇంజనీర్లు పదుల సంఖ్యలో నిర్మాణ సంస్థలకు ఉత్తరాలు రాయగా, పునరుద్ధరణ చర్యలకు సహకరిస్తామంటూనే వ్యయం విషయంలో తమ బాధ్యత ఉండబోదని స్పష్టం చేశాయి. వచ్చే అక్టోబర్ 21తో మేడిగడ్డ బరాజ్ కుంగిపోయి మూడేళ్లు పూర్తికానుంది. బరాజ్‌ల పునరుద్ధరణలో భాగంగా వాటిలో లోపాలను గుర్తించడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ సిఫారసు చేసిన వివిధ రకాల పరీక్షలను బరాజ్‌ల నిర్మాణ సంస్థల పర్యవేక్షణలోనే జరిగినా, వాటికైన వ్యయాన్ని ప్రభుత్వమే భరించింది. బరాజ్‌ల పునరుద్ధరణ పనుల వ్యయాన్ని తొలుత తామే భరించి ఆ తర్వాత నిర్మాణ సంస్థల నుంచి రికవరీ చేసేందుకు ప్రయత్నించాలని ప్రభుత్వం భావిస్తోంది. వ్యయాన్ని భరించేందుకు నిర్మాణ సంస్థలు అంగీకరించకపోవడంతో ప్రభుత్వమే భరించక తప్పనిపరిస్థితి ఏర్పడింది. బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు సంబంధించిన డిజైన్లకు తుది రూపం ఇచ్చి అక్టోబర్ 5లోగా అందజేస్తామని డిజైన్ కన్సల్టెన్సీ ఆఫ్రీ ఇండియా సంస్థ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. ఆ తర్వాత డిజైన్లకు కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత పునరుద్ధరణ పనులకు అంచనాలు రూపొందించి పరిపాలనపర అనుమతులు జారీ చేయనున్నారు.



### ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మేడిగడ్డ ఏడో బ్లాక్!

మేడిగడ్డ బరాజ్ ఏడో నంబర్ బ్లాక్ కుంగిపోయిన నేపథ్యంలో దాన్ని పూర్తిగా తొలగించి కొత్త బ్లాక్ నిర్మించాలా? లేక ఆ బ్లాక్‌ను నాన్ ఓవర్ ఫ్లో(ఎన్‌ఓఎఫ్) డ్యామ్‌గా మార్చాలా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మార్చాలని నిర్ణయిస్తే ఏడో బ్లాక్ గేట్లను తొలగించి పూర్తిగా కాంక్రీట్ గోడగా పటిష్టం చేస్తారు. దీంతో ఆ మేరకు బరాజ్ నుంచి నీళ్లను కిందికి విడుదల చేసే సామర్థ్యం తగ్గిపోనుంది. ప్రత్యామ్నాయంగా బరాజ్‌లకి ఎగువన రెండు వైపులా వరద మళ్లింపు కాల్వలను నిర్మిస్తారు. ఏడో బ్లాక్ పూర్తిగా తొలగించి కొత్త బ్లాక్ నిర్మించడానికి ఏళ్లు పట్టే అవకాశం ఉంది. దానిని తొలగించే సమయంలో ఇరువైపులా ఉన్న బ్లాకులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ఇప్పటికే ఎన్డీఎస్ఏ నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఏడో బ్లాక్‌ను ఎన్‌ఓఎఫ్ డ్యామ్‌గా మార్చేందుకే ప్రభుత్వం మొగ్గుచూపే అవకాశం ఉంది.

### బరాజ్‌లకు దిగువన డయాఫ్రమ్‌వాల్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకి రక్షణగా సికెంట్ పైల్స్ టెక్నాలజీతో నిర్మించిన పునాదులు నూటికి నూరు శాతం పనికి రావని పరీక్షల్లో తేలిందని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. సికెంట్ పైల్స్ విఫలం కావడంతోనే గతంలో బరాజ్‌ల పునాదుల కింద బుంగలు ఏర్పడి భారీగా నీళ్లు లీకయ్యాయి. బరాజ్‌లకి ప్రత్యామ్నాయ రక్షణగా దిగువన కొంత దూరంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని డిజైన్ కన్సల్టెన్సీ సిఫారసు చేసింది. సికెంట్ పైల్స్ విఫలమైనందున డయాఫ్రమ్‌వాల్ పునాదుల (కటాఫ్‌వాల్స్)ను షీట్‌పైల్స్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. మూడు బరాజ్‌ల పునాదుల కింద భారీ సంఖ్యలో బుంగలున్నట్టు గుర్తించగా, వాటిని గ్రౌంటింగ్‌తో పూడ్చివేయాలని నిర్ణయించారు.

### పునరుద్ధరణకు రూ. 1,500 కోట్లు?

మేడిగడ్డ బరాజ్ తుది అంచనా వ్యయాన్ని పరిగణనలోకి తీసుకున్నా ఏడో బాల్క్ పునర్నిర్మాణానికి రూ. 500కోట్ల వ్యయం కానుందని అంచనా. మూడు బరాజ్‌లకు దిగువన మూడు డయాఫ్రమ్ వాల్స్ నిర్మించాల్సి ఉండగా, ఒక్కో డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి సుమారు. 300 కోట్లు కానుందని భావిస్తున్నారు. బుంగలను పూడ్చివేయడానికి గ్రౌటింగ్, ఇతర మరమ్మతులు కలిపి బరాజ్‌ల పునరుద్ధరణకు ప్రాథమికంగా రూ. 1500 కోట్ల వ్యయం కానుందని అంచనా వేశారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలోని బుంగలను గ్రౌటింగ్‌తో పూడ్చివేసి వాటిలో నీళ్లను నిల్వ చేసే అవకాశాన్ని పరిశీలించాలని పభుత్వం భావిస్తోంది. వచ్చే వానాకాలంలోనూ కరువు పరిస్థితులు కొనసాగితే అన్నారం నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లను ఎత్తిపోసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ బరాజ్‌లో తీవ్ర సమస్యలుండటంతో పునరుద్ధరణకు అధిక సమయం పట్టే అవకాశం ఉంది.

# ఆశలు రేకెత్తించిన సెప్టెంబర్ వానలు..

-మొదటిపేజీ తరువాయి



కానీ సెప్టెంబర్‌లో కేవలం 8 శాతమే లోటు వర్షపాతం ఉంది. ఈ విధంగా వర్షపాతం తీరు మారడం, వర్షాల మధ్య విరామం పెరగడంతో ఖరీఫ్ పంటలపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే విషయంలో శాస్త్రవేత్తలు మల్లగుల్లాలు పడుతున్నారు. అయితే ఖరీఫ్‌లో పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉందని, ఎల్‌నినో ప్రభావం కొనసాగితే రబీలో మరింత అధిక ప్రభావం పడుతుందని అంటున్నారు. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలాన్ని నైరుతి రుతుపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సీజన్‌లో కురిసే వర్షాలే రాష్ట్రంలో సాగు పరిస్థితులు, తాగునీటి అవసరాలను నిర్ధారిస్తాయి. కానీ ఈ సీజన్‌లో మొత్తంగా అతి తక్కువ వర్షాలే కురిశాయి. ఈ సీజన్‌లో రాష్ట్రంలో సగటున 74.06 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతంనమోదు కావాలి. కానీ ఇప్పటివరకు కేవలం 61.53 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 12.53 సెంటీమీటర్ల తక్కువ వర్షపాతం నమోదైంది. సీజన్‌లో కురిసే వర్షపాతంలో 17 శాతం తక్కువ వానలు కురిశాయి. పదేళ్ల క్రితం గణాంకాలను పరిశీలిస్తే.. 2017 నైరుతి సీజన్‌లో 65.13 సెంటీమీటర్ల వర్షపాతంనమోదై 12 శాతం లోటు నమోదు కాగా.. ఈ ఏడాది వర్షపాతం మరో 5 శాతం తగ్గడం గమనార్హం.

### 16 జిల్లాలోనే లోటు: ప్రణాళిక శాఖ

రాష్ట్ర సగటు సాధారణ వర్షపాతం లోటులో ఉన్నప్పటికీ..ఐదు జిల్లాల్లో మాత్రం సాధారణ వర్షాలు నమోదు అయ్యాయి. వాతావరణ శాఖ ప్రకారం..మంచిర్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయి. మిగిలిన అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. అయితే రాష్ట్ర ప్రణాళిక శాఖ 20 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాలను సాధారణ కేటగిరీలో చేర్చింది. ఈ లెక్కన రాష్ట్రంలో 16 జిల్లాల్లో మాత్రమే లోటు వర్షపాతం ఉన్నట్టు.. మిగిలిన 17 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు ప్రకటించింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు పరిశీలిస్తే ఒక మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు కాగా.. 41 మండలాల్లో అధికం, 270 మండలాల్లో సాధారణం, 308 మండలాల్లో లోటు, ఒక మండలంలో తీవ్ర లోటు నమోదైనట్లు వివరించింది.

### వారాల తరబడి డ్రై స్పెల్స్

చాలా జిల్లాల్లో డ్రైస్పెల్స్ (వర్షాల మధ్య అంతరాలు) వరుసగా వారాల తరబడి ఉన్నాయి. సాధారణంగా వర్షాలకు అనుకూలంగా ఉన్న సీజన్‌లో రెండు నుంచి నాలుగు రోజులు మాత్రమే డ్రైస్పెల్స్ నమోదయ్యేవి. ఈసారి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. వారం నుంచి పదిహేను రోజులు చినుకు కూడా కురవని రోజులు ఈ సీజన్‌లో నమోదయ్యాయి. జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు మెజార్టీ జిల్లాల్లో వర్షాలే కురవలేదు. జూన్ 11 నుంచి 24వ తేదీ మధ్య కేవలం ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో మాత్రమే వర్షాలు కురిశాయి. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలే నమోదయ్యాయి. జూలై 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రంలో చినుకు పడలేదు. 13 ఆగస్టు నుంచి 18 ఆగస్టు మధ్య కూడా చినుకు జాడ లేదు. అలాగే 26 ఆగస్టు నుంచి 9 సెప్టెంబర్ మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వాన జాడే లేదు. ఇంత భారీ అంతరాలతో వానలు కురవడం వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలిగించింది.

### సెప్టెంబర్ వర్షాలతో పంటలకు ఊరట

సెప్టెంబర్ చివరి వారంలో కురుస్తున్న వర్షాలు పంటలకు కొంత ఊరటనిస్తున్నాయి. అయితే ఆలస్యంగా కురుస్తున్న ఈ వర్షాలు అన్ని ప్రాంతాల్లోనూ ఒకే స్థాయిలో లేవు. ఉత్తర తెలంగాణలో వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు పెరుగుతుండగా, దక్షిణ తెలంగాణలో ఖరీఫ్ విషయంలోనే కాకుండా రబీ సాగుకు అవసరమైన నీటి లభ్యతపై కూడా ఆందోళన కొనసాగుతోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత ఆగస్టు చివరి నాటికి వ్యవసాయశాఖ అధికారులు వరి ఉత్పత్తి కనీసం 20 శాతం మేర తగ్గే అవకాశం ఉందని అంచనా వేయగా.. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో ఈ లెక్కల్లో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### ఉత్తర తెలంగాణలో వరికి ఊపిరి

రాష్ట్రంలో ప్రస్తుతం వరి సాగు చివరి దశలో ఉంది. ఈ సమయంలో వరి పొలాల్లో తగినంత నీరు అవసరం. ఈ పరిస్థితుల్లో ఉత్తర తెలంగాణలో కురుస్తున్న వర్షాలు ఆయా జిల్లాల్లో వరికి ఉపయోగకరంగా మారుతున్నాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కింద ఉన్న పొలాలకు ఈ వర్షాల వల్ల సకాలంలో నీరు చేరనుంది. సాగునీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. నీటి లభ్యతే తుది ఫలితాలను నిర్ణయించనుంది. కానీ వర్షాధార ప్రాంతాల్లో వర్షాల విరామం పెరిగితే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. పత్తి 48.24 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5.93 లక్షల ఎకరాలు..ఇలా ఇతర అన్ని పంటలు కలిపి ముందుగా అనుకున్న అంచనాలను మించి 125 లక్షల ఎకరాలకు పైగా సాగవడం గమనార్హం.


### దక్షిణ తెలంగాణలో ఇబ్బందే..

ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఇప్పుడు కురుస్తున్న వర్షాలు ఉత్తర తెలంగాణలో వరికి కొంత ఊతం ఇచ్చే అవకాశం ఉండగా.. దక్షిణ తెలంగాణలో పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, కందులు వంటి పంటలకు కొంత ఇబ్బంది ఎదురుకానుంది. పత్తి, మొక్కజొన్న పంటలకు నేలలో తేమ కీలక పాత్ర పోషిస్తుంది. వర్షాల మధ్య ఎక్కువ విరామం ఉంటే మొక్క ఎదుగుదల, పూత, కాయ, గింజ అభివృద్ధిపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇంకా కోతకు సమయం ఉన్న పంటలకు ప్రయోజనం కలిగించే అవకాశం ఉంది. అయితే అదే సమయంలో పంట కోత దశకు చేరువలో వరుసగా భారీ వర్షాలు పడితే పత్తి కాయలు దెబ్బతినడం, మొక్కజొన్నలో గింజ నాణ్యత తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే పంట ఏ దశలో ఉన్నప్పుడు ఎంత వర్షం పడిందన్నదే కీలకం.

### జిల్లాల వారీగా వర్షపాతం వివారలు..

-- కుమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో 5 శాతం లోపు లోటు వర్షపాతం ఉంది.
-- జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, ములుగు జిల్లాలో 15 శాతం లోటు కేటగిరీలో ఉన్నాయి.
-- మహబూబాబాద్, నిర్మల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 20 శాతం లోటు నమోదైంది.
-- సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాల్లో 25 శాతం లోటు వర్షపాతం ఉంది.
-- భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో 30 శాతం లోటు నమోదైంది.
-- ఆదిలాబాద్, వరంగల్, హనుమకొండ, నల్లగొండ, నారాయణపేట జిల్లాల్లో 35 శాతం లోటు ఉంది.
-- జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 39% లోటు వర్షపాతం నమోదైంది.

## ఓట్ల చోరీతో బీజేపీ పట్టుబడింది




-మొదటిపేజీ తరువాయి

డేటా నిర్వహణ, పేర్ల తొలగింపు--చేర్పులకు సంబంధించి తలెత్తిన సందేహాలపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అలాగే నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పూర్తి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్వయంగా ఎన్నికల సంఘంలోని మిగిలిన ఇద్దరు కమిషనర్లే సీఈసీ పక్షపాత వైఖరిని తప్పుబట్టారని చెప్పారు. ఇది తీవ్రమైన రాజ్యాంగ సంక్షోభమని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారు నేడు ఆధారాలతో సహా పట్టుబడ్డారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొన్నేళ్లుగా నిరుపేదల కోసం దేశాన్ని కాపాడేందుకు నిరంతరం కష్టపడుతున్నారని.. కాబట్టి ఆయన్ను దేశ ప్రధానిని చేయాలని ప్రజలు చూస్తున్నారని తెలిపారు.

### 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని.. ఈ స్మార్ట్ రేషన్‌కార్డులు పేదోడి ఆత్మగౌరవం అని మంత్రి ఉత్త మ్ చెప్పారు. గత ప్రభుత్వం రూ. 10,500 కోట్లు ఖర్చు చేసి ఇచ్చిన రేషన్ దొడ్డు బియ్యం ప్రజలు తినేందుకు పనికిరాకుండా ఉండేదని.. కోళ్ల ఫారాలకు, బీర్ల కంపెనీలకు, రైస్ మిల్లుల దందాలకుమాత్రమే ఉపయోగపడేదని విమర్శించారు.

## కొత్తగా 41 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం




-మొదటిపేజీ తరువాయి

పరిధిలోని 14 బార్లకు సంబంధించిన దరఖాస్తులను అబ్కారీ భవన్ కమిషనర్ కార్యాలయంలో, ఆయా డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలల్లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఎక్సైజ్ శాఖ కల్పించింది. మిగిలిన జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో బార్లకు దరఖాస్తులను ఆయా ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలతోపాటు కమిషనర్ కార్యాలయంలోనూ, డీపీఈఓ కార్యాలయాల్లోనూ సమర్పించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. సైబరాబాద్ డిప్యూటీ కమిషన్ పరిధిలోని అలియాబాద్‌లో ఒకటి, మూడు చింతలపల్లి ఎల్లంపేట మున్సిపాలిటీలో రెండు చొప్పున 2బీ బార్లకు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోనూ, కుత్బుల్లాపూర్ డీపీఈఓ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పరిధిలోని ఫ్యూచర్ సిటీలో చేవెళ్ల మున్సిపాలిటీలో ఒకటి, మొయినాబాద్ మున్సిపాలిటీలో రెండు 2బీ బార్లకు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ పరిగి మున్సిపాలిటీలో, సంగారెడ్డి జిల్లాలోని గడ్డి పోతారం, కోహిర్ మున్సిపాలిటీలో ఒకటి చొప్పున, గుమ్మడాల మున్సిపాలిటీలో రెండు 2బీ బార్లకు దరఖాస్తులను ఆహ్వానించినట్టు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట, కల్లూరు, మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్, మహబూబ్ నగర్, దేవరకద్ర, నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కామారెడ్డి జిల్లాలోని బిడ్డకుంట, వరంగల్ జిల్లాలో నర్సంపేట్, జనగామ జిల్లాలో స్టేషన్ ఘన్‌పూర్, మహబూబాబాద్ జిల్లాలో కే సముద్రం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగు మున్సిపాలిటీలో కొత్త 2బీ బార్లకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. మరిన్ని వివరాల కోసం ?టజఎఛి .?ట్ఛ ?చఅజ్ఞుఅ?చ.జౌఠి.జీఅ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.

## అన్నీ ఇచ్చినా 'ఆబ్సెంట్' జాబితాలోకి అడిగితే కొత్తగా అప్లై చేసుకోవాలంటూ ఉచిత సలహాలు

సర్‌లో భాగంగా బీఎల్‌వోకు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి ఇచ్చినా సమస్యలు తలెత్తుతున్నాయి. చిరునామా దొరకలేదంటూ అనేకమంది పేర్లను ఏఎస్‌డీడీ జాబితాలో చేరుస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలంటూ బీఎల్?వోలు ఉచిత సలహాలిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన ఓ కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉన్నారు. వారు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బీఎల్?వోకు ఎన్యూమరేషన్ పత్రాలను నింపి ఇచ్చారు. బీఎల్‌వోలు ఆ ఎన్యూమరేషన్ పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రచురించాలి.

ఆపై అనామలీస్, 2002-సర్ మ్యాపింగ్‌లో తేడాలుంటే వారికి నోటీసులు ఇవ్వాలి. లేదంటే ఆ ఎన్యూమరేషన్ పత్రాలు సరిగ్గా ఉన్నట్లు లెక్క. అయితే, చిరునామా దొరకలేదన్న కారణంతో ఈ నలుగురి పేర్లను ఏఎస్‌డీడీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్) జాబితాలో చేర్చారు. ఈ తరహాలోనే ఈ పోలింగ్ బూత్ పరిధిలో 598 మంది ఓటర్లకు ఇదే పరిస్థితి ఎదురైంది.

### సమస్య ఏమిటని ప్రశ్నిస్తే

ఈ సమస్యలు ఎదుర్కొంటున్న వారిని మళ్లీ ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని బీఎల్‌వోలు సూచిస్తున్నారు. తెలంగాణలో 'సర్' తప్పిదాల పరంపరలో ఇదొకటి. ఎన్యూమరేషన్? పత్రాలను సమర్పించిన ఓటర్లనూ ఏఎస్?డీడీ జాబితాలో ఉంచి ముసాయిదా జాబితాలో ప్రచురించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2,64,87,213 ఎన్యూమరేషన్? పత్రాలకు డిజిటలైజేషన్? చేశారు. ఓటర్లు సమర్పించిన పత్రాల్లో అనుమానాలున్న 92.87 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందించారు. అన్?కలెక్టబల్? విభాగం కింద శాశ్వతంగా చిరునామా మారడం, చిరునామాలో లేకపోవడం, మృతి చెందడం, డూప్లికేట్? (ఏఎస్?డీడీ) కింద మరో 73.39 లక్షల మంది ఓటర్లను తొలగించారు.

### బీఎల్‌వోలు అప్‌లోడ్ చేయలేదని విమర్శలు

ఏకపక్షంగా ఓటర్లను తొలగించారని, బీఎల్?వోలు అనేక ప్రాంతాల్లో ఎన్యూమరేషన్? పత్రాలను అందించలేదని రాజకీయ పార్టీలు ఆరోపించాయి. వివిధ ప్రాంతాల్లో ఓటర్లు పత్రాలను పూర్తి చేసి ఇచ్చారు.

## సంపాదకీయం

# డిజిటల్ యుగంలో భాషా పరిణామం

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి 'తెలుగు భాషా చరిత్ర' గ్రంథంలో తెలుగు మాండలికాలు -- ప్రమాణ భాష గురించి తెలుపుతూ 'జీవద్భాషకు మార్పు సహజం. మార్పు వల్ల భాషలో బహురూపత, వైవిధ్యం ఏర్పడతాయంటారు'. అట్లనే ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు భాష నిత్య పరివర్తన శీలి, ప్రజల అవసరాలు, సంస్కృతి మారేకొద్దీ భాష సమాజానికి అనుగుణంగా మారుతుంది తప్ప, సమాజం కోసం భాష ఆగదు అంటారు. సరిగ్గా పైవ్యాఖ్యలను నిజం చేస్తూ నేటి జెన్–జీ నుంచి కొత్త పదాలు పుట్టుకొస్తున్నాయి. నేటి డిజిటల్ యుగంలో మనం 1997 నుంచి 2012 మధ్య జన్మించిన తరాన్ని 'జెన్–జీ' (జనరేషన్ జెడ్) అని పిలుస్తున్నాం. ఇంటర్నెట్, సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ఒడిలోనే పెరిగిన ఈ తరం సృష్టించుకున్న భాషా సంస్కృతి గత తరాల కన్నా భిన్నమైనది, విలక్షణమైనది. ఈ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఆధునిక యువత సంభాషణ శైలినే సాధారణంగా 'జెన్–జీ భాష' అని పిలుస్తున్నాం. 'జెన్–జీ' భాష అనేది డిజిటల్ మాధ్యమాలు సృష్టించిన కొత్త సమాచార అవసరానికి ప్రతిస్పందన. ఇది భాష క్షీణత కాదు. భాషా పరమైన ఒక 'సరికొత్త మాండలికం' గా పరిగణించాలి. ఈ సమాజపు జీవనశైలికి, ఆలోచనా విధానానికి, సంస్కృతికి, కాలానుగుణ వస్తున్న మార్పులకు ఈ 'జెన్–జీ' భాష అద్దం పడుతుంది. ఒకప్పుడు ఉత్తరాలు, తర్వాత ఫోన్ సంభాషణలు, ఆ తర్వాత ఎస్ఎంఎస్‌లు, ఇప్పుడు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, థ్రెడ్స్, యూట్యూబ్, షార్ట్ వీడియోల వంటి డిజిటల్ మాధ్యమాలు సంభాషణ పద్ధతిని గణనీయంగా మార్చాయి. పూర్వం గ్రాంథికం నుంచి వ్యావహారిక భాషోద్యమం వచ్చినట్టే నేడు వ్యావహారికంలో నుంచి డిజిటల్ వ్యక్తీకరణల దిశగా మార్పులు జరుగుతున్నాయి. జెన్–జీ యువత తమ భావాలు, అంతరంగాలను అత్యంత వేగంగా, సమర్థవంతంగా వ్యక్తీకరించడానికి ప్రస్తుతం సోషల్ మీడియాను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో దేశ రాజకీయాల్లో కూడా ఈ ప్రకంపనలు చూశాం.. చూస్తున్నం కూడాను. ఈ 'జెన్–జీ'లు వాడుతున్న భాషను నిశితంగా పరిశీలిస్తే మనకు కొన్ని స్పష్టమైన అంశాలు కనిపిస్తాయి. ముఖ్యంగా వేగం, సంక్షిప్తత, సృజనాత్మకత, హాస్యం, భావోద్వేగాల వ్యక్తీకరణ, ఇతర భాషల కలవడం ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. అట్లనే వేగంగా చాటింగ్ చేయడానికి పదాలను కుదించి వాడడం ప్రాథమిక లక్షణంగా కనిపిస్తున్నది. ఉదాహరణకు ఐడీకే (ఐ డోన్ట్ నో), ఎఫ్ఆర్ (ఫర్ రియల్), టీబీహెచ్ (టు బీ హానెస్ట్), ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) వంటి పదాలు. అట్లానే ఒక విషయాన్ని లేదా భావాన్ని వ్యక్తపరచడానికి కొత్త పదాలను నిర్మిస్తున్నారు. ఉదాహరణకు ఘోస్టింగ్ (హఠాత్తుగా మాట్లాడడం మానేయడం), ఫ్లెక్స్ (గొప్పలు చెప్పుకోవడం), రిజ్ (ఆకర్షించే నైపుణ్యం), స్లే (అద్భుతంగా చేయటం) వంటి కొత్త పదాలు విస్తృతంగా నేడు వాడుకలో ఉన్నాయి. ఈ జెన్–జీ భాష కేవలం అక్షరాలకు మాత్రమే పరిమితం కాకుండా ఎమోజీలు, మీమ్స్, జిఫ్‌ల ద్వారా సమాచారాన్ని వ్యంగ్యంగా, సూటిగా, తక్కువ సమయంలో ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక రకంగా లిఖిత–దృశ్య రూపాల సమ్మేళనం. నేడు తెలుగు, ఇంగ్లిష్, హిందీ మొదలైన 'భాషల మిశ్రమ' పదజాలం సంక్షిప్త రూపంలో కనిపిస్తున్నది. ఉదాహరణకు ఈ సినిమా చాలా బాగుంది అని తెలుగులో అంటాం. దీన్ని జెన్–జీ భాషా శైలిలో సినిమా ఫుల్ ఫైర్ అని చెప్తుంటారు. నాకు అతని ప్రవర్తన నచ్చలేదు. జాగ్రత్తగా ఉండాలి అనడానిక జెన్–జీలు అతని బిహేవియర్ చూస్తే రెడ్ ఫ్లాగ్ మాట్లాడుతారు. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావు అనే మాటను జెన్–జీలు ఓవర్ థింకింగ్ చేయకు, చిల్ అని క్లుప్తంగా అంటుంటారు. ఎవరైనా అకస్మాత్తుగా మాట్లాడటం మానేస్తే, నన్ను గోస్ట్ చేశారు అని చెప్తారు. నీ పని చాలా అద్భుతంగా ఉన్నది అని అనడానికి ఇది ఫుల్ స్లే అని వ్యాఖ్యానిస్తుంటారు. ఇవే కాకుండా ఇంకా సోషల్ మీడియా మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతున్న కొన్ని పదాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉదాహరణకు ఫుల్ వైబ్, టైమ్ పాస్, క్రష్, లిటరల్లీ, రియల్, రెడ్ ఫ్లాగ్, గ్రీన్ ఫ్లాగ్, చిల్, ఫైర్, బ్లాస్ట్, మాస్, అదుర్స్, గూస్ బంప్స్, ఓఎంజీ, ఎల్‌వోఎల్, మ్యూట్, టాక్సిక్, స్పేస్ మొదలైనవి కనిపిస్తున్నప్పటికీ ఇది గతంతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ మాధ్యమాల కారణంగా మరింత వేగం పుంజుకున్నది. విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఒకరకంగా నేడు 'సోషల్ మీడియా ఒక నూతన భాష ప్రయోగశాల'గా మారుతున్నది. ప్రస్తుత భాషావేత్తలకు, భాషాభిమానులకు ఈ జెన్–జీ భాషపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. కొందరు దీనిని భాషా పరిణామానికి సహజ రూపంగా, యువత కొత్త అనుభవాలకు, కొత్త సాంకేతికతకు నిదర్శనంగా భావిస్తున్నారు. మరోవైపు మాతృభాషలో ఇంగ్లిష్ పదాల అధిక వినియోగం వల్ల తెలుగు పదజాలం మరుగున పడే ప్రమాదం ఉన్నదని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా భాషను ఒకే చోట నిలిచిపోయే వస్తువుగా చూడలేం కాలంతో పాటు భాష కూడా మారుతున్నది. ఒక తరం ఉపయోగించిన పదాలు మరో తరానికి కొత్తగా అనిపించవచ్చు. కానీ, తర్వాత అవే సాధారణ భాషలో భాగమవుతాయి. అందువల్ల జెన్–జీ భాషను అర్థం చేసుకోవడం అంటే నేటి యువత ఆలోచన ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే. అందుకే వివిధ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు డిజిటల్ భాషా పరిజ్ఞానం అవసరాన్ని గుర్తించి 'తెలుగు భాష సాంకేతికత' అనే పాఠ్యాంశాలను కూడా జోడిస్తున్నాయి. ప్రస్తుతం ఈ 'జెన్–జీ' వాడుతున్న భాషను చాలామంది వ్యాకరణం లేని భాషగా లేదా సంప్రదాయ భాషకు ముప్పుగా అభివర్ణిస్తున్నారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా విస్తరిస్తున్న ఈ నూతన సంభాషణల ధోరణిని భాషా సహజ గుణంగా గుర్తించి అర్థం చేసుకోవడమే సమగ్రమైన వైఖరి. భాష మారడం అనేది భాష బలహీనత కాదు. మారుతున్న సమాజాన్ని స్వీకరించే భాషా చైతన్యానికి ఒక సంకేతంగా పరిగణించాలి. అయితే మార్పును స్వీకరిస్తూనే మాతృభాష మూలాలను కాపాడుకోవడం కూడా ఇప్పుడు మన ముందున్న బాధ్యత, అతిపెద్ద సవాలు కూడాను.

# సర్' జ్ఞానేశ్ సంకటంలో సర్కార్!



భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్న తీరును ఇటీవలికాలంలో నేనూ పలుమార్లు ఆక్షేపించాను. 'సర్' (ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ అమలుపై సీఈసీ, ఆయన సహచర ఎన్నికల కమిషనర్ల (ఈసీ) మధ్య అభిప్రాయ భేదాలను పాత్రికేయురాలు రితికా చోప్రా ఇటీవల బహిర్గతం చేశారు. ఆమె పరిశోధనాత్మక కథనాన్ని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించకపూర్వమే ఆ రాజ్యాంగ సంస్థలో పరిస్థితులు సజావుగా లేవన్న వాస్తవం మనలో చాలా మందికి తెలుసు. త్రిసభ్య రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం సమైక్యంగా బాధ్యతలు నిర్వర్తించడం లేదని ఇప్పుడు ప్రజాబాహుళ్యానికీ తెలిసిపోయింది. ఎన్నికల ప్రక్రియ పవిత్రత గురించి భారతీయ ఓటర్లు కలవరపడుతున్నారు. ఆరోపణలు వెల్లువెత్తుతున్నా జ్ఞానేశ్ కుమార్ నిష్క్రమించడం లేదు. తనపై వచ్చిన నిందారోపణలతో ఎన్నికల సంఘం ప్రతిష్ఠ మసకబారిందనే వాస్తవాన్ని గుర్తించి, నైతిక బాధ్యతతో జ్ఞానేశ్ గౌరవప్రదంగా రాజీనామా చేస్తారని ఆశించవద్దు. ఒక గౌరవనీయుడైన వ్యక్తి ఇటువంటి సందర్భాల్లో 'వివాదాన్ని పొడిగించి భారత ప్రజాస్వామ్యానికి హాని చేసే ఉద్దేశం నాకు లేదు. కనుక నేను పదవి నుంచి వైదొలుగుతాను' అని ప్రకటిస్తాడు. 'నేను ఏ తప్పూ చేయలేదు. అయినప్పటికీ పదవిలో కొనసాగడం ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేయవచ్చు' అని కూడా అనవచ్చు. జ్ఞానేశ్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదిస్తుంది. చాలా కాలంగా తాము చెప్పినట్లు చేసిన ఈ సివిల్ సర్వీస్ అధికారిని కొంత విరామం అనంతరం ఏదో ఒక దేశానికి భారత రాయబారిగా పంపించవచ్చు. జమ్మూ––కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చిన రాజ్యాంగ అధికరణ 370 రద్దు, రామ జన్మభూమి ట్రస్ట్ ఏర్పాటు, సహకార సంఘాలను ఏకీకృత అధికార పరిధిలోకి తీసుకురావడం మొదలైన చాలా వ్యవహారాలలో ఆయన కీలక పాత్ర నిర్వహించారు కనుక ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా పంపవచ్చు. జ్ఞానేశ్ స్థానంలో సీఈసీగా మరో వీర విధేయుడిని ప్రభుత్వం నియమించుకుంటుంది. అయితే జ్ఞానేశ్ కుమార్ తనంతట తానుగా వెళ్లిపోరు. మరి, ప్రభుత్వానికి ఇది ఆమోదయోగ్యమేనా? జ్ఞానేశ్‌ను 'నిర్వాచన్ సదన్' నుంచి గెంటివేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నేను భావించడంలేదు. జ్ఞానేశ్‌ను సాగనంపేందుకు ప్రభుత్వం విముఖత చూపవచ్చు. ఆయన పట్ల ప్రేమాభిమానాలు ఉండడం అందుకు కారణం కాదు. మరేమిటి? జ్ఞానేశ్ నిష్క్రమణ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది కనుక. యూపీఏ ప్రభుత్వ చివరి రోజులలో చోటుచేసుకున్న ఘటనలు భారతీయ జనతాపార్టీలో ఎవరూ ఇంకా మరచిపోలేదు. ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతిపై వివాదాలు తీవ్రమవుతున్న కొద్దీ, పత్రికలు ప్రభుత్వ పదవులలో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని ఆ వివాదాలను మరింత పెంచేవి. పత్రికలు ఎవరిని లక్ష్యంగా చేసుకున్నా యూపీఏ పెద్దలు సదరు మంత్రులకు ఉద్వాసన చెప్పారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఒత్తిడికి లొంగిపోయే నాయకుడుగా ప్రజలకు కనిపించారు. ఇది యూపీఏకు నష్టదాయకమయింది. ఆరోపణలకు గురైన ఒక మంత్రిని తొలగించినప్పుడు పత్రికలు, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై మరిన్ని విమర్శనాస్త్రాలను సంధించేవి. మరింత మంది మంత్రులు రాజీనామా చేయాలనే డిమాండ్ వచ్చేది. ఈ పరిణామాలు అంతిమంగా 2014 సార్వత్రక ఎన్నికలలో యూపీఏ ఓటమికి దారితీశాయి. యూపీఏ సర్కార్ ఎదుర్కొన్న దయనీయ పరిస్థితులు తన ప్రభుత్వానికి వాటిల్లాలని నరేంద్ర మోదీ ఎందుకు కోరుకుంటారు? అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ మీడియా విమర్శలను ఆయన లెక్క చేయలేదు. నిర్ణయాలను వెనక్కి తీసుకోవడానికి ఆయన ససేమిరా అంటారు. ఈ కారణంగానే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించడంలో తాత్సారం చేశారు. జంతర్ మంతర్ వద్ద అశేష యువజనులు వారాల తరబడి చేసిన నిరసనలు ఆసేతు హిమాచలం దావానలంలా వ్యాపించే ప్రమాదమున్నదని గ్రహించిన తరువాతనే నరేంద్రమోదీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ఆదేశించారు. లేనిపక్షంలో తాను యువజనుల మద్దతు కోల్పోవలసివస్తుందని మోదీ భయపడ్డారు. కాబట్టి, ఒకవేళ ఈ ప్రభుత్వం జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే, అది మోదీకి వేరేదారి లేకపోయినందువల్ల మాత్రమే జరుగుతుంది. మరి, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ కొనసాగిన పక్షంలో జరిగేదేమిటి? ఓటర్ జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను, ఎన్నికల వ్యవస్థను ఆయన దుర్వినియోగం చేశారన్న వాస్తవం ప్రజల మనసుల్లో అలాగే ఉంటుంది. పత్రికలను ప్రభుత్వం మచ్చిక చేసుకోగలదుగానీ సామాజిక మాధ్యమాలపై నియంత్రణ సాధ్యమయ్యే విషయం కాదు. అవి సర్వస్వతంత్రాలు. న్యూస్ చానెల్స్ విచక్షణారహితంగా ఇస్తున్న మద్దతు, 'విశ్వసనీయ వర్గాలు' 'మూలాల' పేరుతో ప్రచారం చేస్తున్న విషకథనాలు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో విఫలమవుతున్నాయన్న సత్యాన్ని ప్రభుత్వం గ్రహిస్తోంది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల, యువజనుల నిరసనలను అణచివేయడంలో అవేమీ ఉపకరించలేదు. ఎన్నికల సంఘంలో ఏకీభావం లోపించడం గురించి బహిర్గతమైన వాస్తవాలపై ప్రజాగ్రహం చెలరేగకుండా నియంత్రించడమూ వాటిద్వారా అసాధ్యం. అందువల్ల, ప్రజల ఓపికను పరీక్షించడం ఒక్కటే ప్రభుత్వం దగ్గర మిగిలింది. సీఈసీకి ఉద్వాసన చెప్పి తీరాలని డిమాండ్ చేసీ చేసీ జనం విసుగుచెంది మిన్నకుండిపోతారని ఆశిస్తోంది. ఒక వారం తరువాత మీడియా దగ్గర కొత్త విషయాలు ఏవీ ఉండబోవనీ, జ్ఞానేశ్‌పై విమర్శలు పచ్చినిజాలే అయినప్పటికీ అవి పదే పదే పునరావృతమయితే ప్రజలకు తప్పక విసుగుపుట్టిస్తాయని, వారు వాటిని పట్టించుకోవడం మానివేస్తారని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలదృష్టిని మళ్లించేందుకు కొన్ని 'ఇతర' అంశాలను తెరపైకి తీసుకువచ్చే అవకాశమూ లేకపోలేదు. జ్ఞానేశ్‌పై మరోసారి ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని తీసుకువచ్చి తీరుతాయి కూడా. అయితే లోక్‌సభ స్పీకర్ గానీ, రాజ్యసభ చైర్మన్ గానీ ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు, పెట్టినా దానిపై చర్చించేందుకు అంగీకరిస్తారా? అంగీకరించరు. కొద్ది నెలలక్రితం విపక్షాలు ఇదే సీఈసీకి వ్యతిరేకంగా తీసుకువచ్చిన అభిశంసన తీర్మానానికి పట్టిన గతే తాజా తీర్మానానికీ పడుతుంది. ఎన్నికల సంఘం వ్యవహారాలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం లేదు కనుక, అత్యున్నత న్యాయస్థానం ఉదాసీనతను ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకోవచ్చు. ఈ వివాదం రేగడానికి మరో అదనపు కారణం ఢిల్లీలో 'సర్' ప్రక్రియలో అవకతవకలే. ఢిల్లీలోని 1.45 కోట్ల ఓటర్లలో 47 లక్షల మంది ఓటర్ల పేరును 'సర్' ఎన్యూమరేషన్ దశలోనే తొలగించారు. ముసాయిదా జాబితాలలోని 97 లక్షల మంది ఓటర్లలో 33లక్షల మందికి 'తార్కిక వ్యత్యాసాలు' అనే కారణంతో నోటీసులు జారీ చేశారు. దశాబ్దాలుగా ఓటు వేస్తున్నవారిని తమకు ఓటుహక్కు ఉందని నిరూపించుకోవాలని నోటీసు ఇచ్చారు. ఓటర్ జాబితాల నుంచి లక్షలాది ఓటర్ల పేర్లను తొలగిస్తే ప్రజలు ఆగ్రహోదగ్రులు అవ్వరని కేవలం ఒక మోసగాడు లేదా ఒక మూర్ఖుడు లేదా జ్ఞానేశ్ మాత్రమే విశ్వసించగలరు. ఓటర్ జాబితాలపై నెలకొన్న ఈ గందరగోళాన్ని త్వరితంగా పరిష్కరించాలని ప్రభుత్వంలో ఉన్న ఓ పెద్ద మనిషి ఆదేశిస్తే, సీఈసీపై ప్రజాగ్రహం సమసిపోవచ్చు, నిరసనలకు ప్రాధాన్యం పోవచ్చు. మరి, ఇది వాస్తవిక అంచనాయేనా? సమస్యేమిటంటే జ్ఞానేశ్ స్వయంగా ఈ సమస్యలో భాగం. ఒక ప్రభుత్వాధికారిగా విధులు నిర్వహించడంలో ఆయన ఒక అహంకారి. సర్ ప్రక్రియలో ఆయన జోక్యం చేసుకుంటున్నారని విన్నప్పుడు దానిని విశ్వసించనివారెవరూ ఉండరు. జ్ఞానేశ్‌కు ప్రభుత్వం ఇంతగా మద్దతు ఇవ్వడానికి ఒక అవ్యక్త కారణం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి మరో ఐదారునెలల్లో జరగవలసిన ఎన్నికలే. ఆ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని జ్ఞానేశ్ ఘంటాపథంగా చెబుతున్నారు. యూపీ ఎన్నికలలో బీజేపీ పెద్ద మెజారిటీతో గెలిస్తే అధికారపక్షానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా, మోదీ ప్రజాదరణ తగ్గిపోయిందన్న భావనను అది ప్రభావితం చేస్తుంది. దేశ ప్రజల్లో ఉన్న ఆ అభిప్రాయం సమసిపోగలదని మోదీ ప్రభుత్వం భావిస్తున్నందున, దాని వ్యూహంలో జ్ఞానేశ్ ఒక కీలక వ్యక్తిగా ఉండవచ్చు. అయితే, ఎన్నికల సంఘం ఉద్దేశాలు, దాని తీరుతెన్నులపై ప్రజల్లో చాలా అనుమానాలు ఉన్నాయనేది వాస్తవం. ఒకవేళ యూపీలో బీజేపీ మళ్లీ అధికారానికి వచ్చినా ఆ విజయం కనీసం ప్రజల దృష్టిలో చట్టబద్ధమైనది, సమగ్రమైనది కాకపోవచ్చు. జ్ఞానేశ్ విషయంలో ఏం చేయాలన్నది నిర్ణయించుకొనేముందు, ప్రజల ఆగ్రహం ఎంతవరకు కొనసాగగలదో ప్రభుత్వం వేచి చూస్తుంది. ప్రజా వ్యతిరేకత మరింతగా పెరుగుతూ, అది దీర్ఘకాలం నిలబడితే అప్పుడు ఆయన్ని తొలగించడం అనివార్యమవుతుంది. చివరగా ఒక నిష్ఠుర సత్యాన్ని చెప్పక తప్పదు. సీఈసీకి వ్యతిరేకంగా ఉధృతమవుతోన్న ఈ నిరసనల బెడద నుంచి ప్రభుత్వం ఒకవేళ ఎప్పటికైనా బయటపడినప్పటికీ, మోదీ సర్కార్‌కు మంచి రోజులు ముగిసిపోయాయన్న భావనను ప్రజల మనసుల నుంచి చెరిపివేయడం కష్టం. పరిస్థితులు తలకిందులు అయినప్పుడు సంక్షోభాలు వస్తూనే ఉంటాయి.

# ఓ నిశ్శబ్ద సంక్షోభం!



భారత్ భవిష్యత్‌లో ఎదుర్కొనే అతిపెద్ద సవాలు ఏమిటి? నిరుద్యోగం, కృత్రిమ మేధ, వాతావరణ మార్పు, నీటికొరత––ఇవన్నీ మాట్లాడుకుంటున్నాం. కానీ మరో సంక్షోభం గురించి చర్చ జరగడం లేదు-- అదే సంరక్షణ కొరత---- కేర్ డెఫిసిట్. పిల్లలను చూసుకునేవారు, వృద్ధులకు తోడుగా ఉండేవారు తగ్గిపోతున్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతను మహిళలే మోశారు. కానీ ఉమ్మడి కుటుంబాలు కరిగిపోతున్నాయి, మహిళల ఉపాధి పెరుగుతోంది. సంరక్షణ అవసరం పెరుగుతుంటే, తీర్చాల్సిన కుటుంబాలు చిన్నవవుతున్నాయి. ఒక మహిళ తన పిల్లల కోసం ఉద్యోగం వదిలేస్తే, ఆమె నైపుణ్యం, ఆదాయం, స్వంత జీవితం-- అంతా ఆగిపోతుంది. ఈ నష్టం ఆమె కుటుంబానికి, పనిచేసే సంస్థకు, చివరికి దేశానికి కూడా చెందుతుంది. భారత టైమ్ యూజ్ సర్వే ప్రకారం, మహిళలు రోజుకు అయిదు గంటలు వేతనం లేని పని చేస్తారు. ఇది ఇంటి పని. పిల్లల, వృద్ధుల సంరక్షణ సమయం వేరే. ఈ పనిని ఎవరూ లెక్కవేయలేదు, ఎందుకంటే అది 'బాధ్యత' అనుకుంటారు. ఈ 'బాధ్యత' ఆర్థిక విలువ ఎంత? మహిళల ఉచిత గృహ, సంరక్షణ శ్రమ విలువ భారత జీడీపీలో 15 నుంచి 17శాతం-- అంటే రూ.34 లక్షల కోట్లకు పైగా ఉంటుందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అంచనా. మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యంలో ఉన్న అంతరాన్ని పూడిస్తే 2025 నాటికి భారత జీడీపీకి సుమారు రూ.64 లక్షల కోట్లు జతకావొచ్చని మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా. సంరక్షణ భారం తగ్గితే, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పెరుగుతుందో ఈ రెండు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రపంచ సంస్థలు కూడా ఇదే చెబుతున్నాయి. కేర్ సేవల్లో పెట్టుబడి పెడితే మహిళల ఉపాధి పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. భారత ఆర్థిక సర్వే దీన్ని భారీ ఉపాధి రంగంగా పేర్కొంది; సుప్రీంకోర్టు కూడా సంరక్షణను దేశ నిర్మాణంలో కీలక భాగంగా చెప్పింది. ఈ సంక్షోభం భారత్‌కు మాత్రమే పరిమితం కాదు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇదే సవాలును ఎదుర్కొంటున్నాయి. జర్మనీలో వృద్ధుల సంరక్షణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. ఆ వృద్ధుల పిల్లల వార్షిక ఆదాయం లక్ష యూరోలు దాటితేనే, వారి నుంచి కొంత ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది. భారత్ కూడా తన మార్గాన్ని కనుగొనాల్సిన సమయం ఆసన్నమైంది. 2050 నాటికి భారత జనాభాలో దాదాపు 20శాతం మంది వృద్ధులు ఉంటారు. వారి సంరక్షణకు మూడు కోట్ల శిక్షణ పొందిన సిబ్బంది అవసరమని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అంచనా. రాబోయే దశాబ్దాల్లో భారత్ ఎంత పెద్ద సంరక్షణ మౌలిక వసతిని నిర్మించాల్సి ఉంటుందో ఈ సంఖ్యే చెబుతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు కేర్ ఎకానమీని సంక్షేమ కార్యక్రమంగా కాకుండా ఉపాధి, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య వ్యవస్థలను కలిపే అభివృద్ధి వ్యూహంగా చూస్తున్నాయి. భారత్ కూడా అదే దిశగా అడుగులు వేయాలి. రేపటి సంక్షోభం ఉద్యోగాలు లేకపోవడం వల్ల మాత్రమే కాదు, ఉద్యోగం చేయాలనుకున్న వారిని కాపాడుకునే వ్యవస్థ లేకపోవడం వల్ల కూడా రావొచ్చు. దీన్ని నివారించాలంటే, సంరక్షణను కుటుంబ వ్యక్తిగత బాధ్యతగా కాకుండా, విద్య, ఆరోగ్యం లాగే మౌలిక సదుపాయంగా మార్చాలి.

# కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)ని పదవి నుంచి తొలగించాలి

సిఇసి ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో ఈనెల 28 తేదీన కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన --- కొత్వాల.

కాంగ్రెస్ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి:





**భద్రాది కొత్తగూడెం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ని వెంటనే పదవి నుండి తొలగించాలని రాష్ట్ర సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను చేపడుతున్నదని, కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ బిజెపి పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని, ఆయనను వెంటనే పదవి నుండి తొలగించాలన్నారు. ?కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో ఈనెల 28 తేదీన కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఉదయం 10:00 గంటలకు నిరసన కార్యక్రమాలు చేపట్టామని , కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ. జలీల్, నరహరి, బాలు నాయక్, భట్టు మురళి, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, డాక్టర్ బి.ఎస్. రావు, నూకల సరిత, సీరపు సుగుణ, దంతేబోయిన నరేష్, ధర్మసోత్ నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# హరిణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.





**భద్రాది కొత్తగూడెం :** సుజాతనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు కొవ్వొత్తుల నిరసన రోజురోజుకు సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువవుతోంది,నిందితుల అరెస్టు విషయంలో జాప్యం ఎందుకు ప్రభుత్వం స్పందించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి ??జూలూరుపాడు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ఇంద్ర పల్లి హరిణి ని దారుణంగా హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాడు సుజాతనగర్ మండల కేంద్రం లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ నగర్ మహిళలు హరిణి చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ నిరసన తెలిపారు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ అంబేద్కర్ వాది వేల్పుల భాస్కర్ మాట్లాడుతూ హత్య జరిగి ఇన్ని రోజులు కావస్తున్నా నిందితుల అరెస్టు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందో అర్థం కావటం లేదని ఈ విషయంలో రాజకీయాలకు ఎలాంటి తావు ఉండకూడదని ప్రభుత్వం వెంటనే స్పందించి హరిణి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం 25 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు, మాజీ కోఆప్షన్ మెంబర్ సయ్యద్ మీరాబి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు ఆడపిల్లలకు రక్షణ కరువైందని ఇటీవల కాలంలోనే ఇలాంటి ఘటనలతో ఎంతోమంది ఆడపిల్లలు హత్యకు గురయ్యారని ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులు భయంతో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని కారకులను కఠినంగా శిక్షించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్.కె షకీలా, ఈట వెంకటమ్మ ,వేల్పుల వేణమ్మ, గుర్రం ఆరోగ్యం, కేసు పాక సీతారాములు, వేల్పుల బాయమ్మ ,కాకటి సరోజిని, గుర్రం కోటేశ్వరి, గద్దల అలివేలు, మంద మెర్సి ,కుక్కమూడి అంజమ్మ ,వేల్పుల రేణుక, కుక్కమూడి దుర్గ ,కవులూరి అరుణ, ఇలారపు ఎస్తేరు, ఈట సంధ్య, వేల్పుల హన్సిక, కుక్క ముడి లాస్య, కాకటి సుందరం, ఎస్.కె హమీద్, దంసల పూరి గాంధీ ,కేసు పాక శ్రీను ,కుక్క ముడి ప్రసాద్ ,కత్తి మనోజ్, దంసలపురి పవన్, కాకటి వెంకన్న, కౌలూరి దుర్గారావు, కుక్క ముడి జగదీష్, భద్రం, సాత్విక్, రాకేష్ ,జాషువా, తదితరులు పాల్గొన్నారు

## టీం ఈవైఎ ఆధ్వర్యంలో అట్టహాసంగా శుభోదయ కాలనీ వినాయకుని నిమజ్జన వేడుకలు...

డప్పు వాయిద్యాల హోరులో మహిళలు, చిన్నారుల నృత్యాలు...

భక్తి శ్రద్ధలతో పాల్గొన్న కాలనీవాసులు...



**శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్** డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో టీం ఈ వై ఎ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. టీం ఈవైఎ సభ్యులు, కాలనీ నివాసి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తి, ఉత్సాహం, ఆటపాటలతో సందడిగా సాగాయి. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. డప్పు వాయిద్యాల హోరులో మహిళలు, చిన్నారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిమజ్జన ఊరేగింపులో డప్పు వాయిద్యాల మోత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్దలు సైతం ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. వినాయక నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో కాలనీ వీధులు మార్మోగాయి. ఎటుచూసినా పండుగ వాతావరణం నెలకొంది. నిమజ్జన కార్యక్రమానికి ముందు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు సమర్పించుకున్నారు. కాలనీవాసుల సమష్టి భాగస్వామ్యంతో భక్తి, సాంస్కృతిక సందడి కలగలిసిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి. చివరగా "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్య.. అంటూ భక్తులు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి సునీతప్రభాకర్‌రెడ్డి




**శేరిలింగంపల్లి:** అమెరికా పర్యటనను ముగించుకుని శేరిలింగంపల్లి మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మహిళా శేరిలింగంపల్లి మండల అధ్యక్షురాలు కొండవీటి సునీతప్రభాకర్‌రెడ్డి స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు స్వాగతం పలికారు. అమెరికా పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, అక్కడి తెలుగు ప్రజలు, వివిధ వర్గాల వారితో సమావేశమై స్థానిక పరిస్థితులు, సామాజిక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పర్యటన సందర్భంగా తనను ఆత్మీయంగా పలకరించిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటానని సునీతప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మహిళల సమస్యలు, స్థానిక ప్రజల అవసరాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## "వెన్నుపోటు పార్టీ వంచన పై బీసీ గర్జన"కు తరలి వెళ్ళిన బీసీ నేతలు



**భారతీయ వెలుగు,ఉమ్మడి తూ. గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి,అనపర్తి):**కాతేరులోని వెంకటాద్రి ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన "వెన్నుపోటు పార్టీ వంచన పై బీసీ గర్జన"కు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, అనపర్తి మండలాలకు చెందిన వైయస్సార్సిపి బీసీ నేతలు పార్టీ బీసీ సెల్ కన్వీనర్ కొండేటి భీమేశ్వర స్వామి, గుత్తుల వెంకటరమణ ఆధ్వర్యంలో భారీ గా తరలి వెళ్లారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి (వైఎస్ఆర్ సిపి) కార్యాలయం వద్ద నుండి కొండేటి భీమేశ్వర స్వామి, పెదపూడి మండల పార్టీ కన్వీనర్ గుత్తుల వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ బీసీ నేతలు ర్యాలీగా బయలుదేరి రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరులో జరిగిన వెన్నుపోటు పార్టీ వంచన పై బీసీ గర్జనకు తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కేతా తులసి శ్రీనివాస్, బిక్కవోలు మాజీ జెడ్పిటిసీ రొంగల పద్మావతి అప్పాజీ, మాజీ వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబత్తుల చంటి,మాజీ జెడ్పిటిసి కిలపర్తి సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ పొలాటి నాగేశ్వరరావు, పెనుగొండ శ్రీనివాస్, బండారు శ్రీనివాస్, గుడాల మాచరరావు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, గుత్తుల సుబ్రమణ్యం, చింతా రామారావు తదితరులు ఉన్నారు.

## కానిస్టేబుల్ సత్యనారాయణ మానవత్వం ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఆర్థిక సాయం



**బంటు రమేష్ బ్యూరో చీఫ్ ఉమ్మడి నల్గొండ జిల్లారామన్నపేట సిద్దిపేట** రామన్నపేట కానిస్టేబుల్ సత్యనారాయణ తన గొప్ప మనసు చాటుకున్నారు సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు నాచారం భాస్కర్ ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందారు భాస్కర్ కుటుంబం తీవ్ర పేదరికంలో ఉండగా అతనికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు స్నేహితుడి మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు కానిస్టేబుల్ సత్యనారాయణ ముందుకు వచ్చారు ఆ ఇద్దరు ఆడపిల్లల పేరు మీద రూ 50 వేలతో ఫిక్స్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు అంతేకాకుండా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని పిల్లలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో స్నేహితులు తదితరులు పాల్గొన్నారు తోటి మిత్రుడి కుటుంబానికి ఆపద సమయంలో కానిస్టేబుల్ అండగా నిలవడంపై స్థానికులు ఆయనను అభినందిస్తున్నారు

## బాపూజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి.




**సదాశివపేట :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం పిలుపునిచ్చారు. బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సదాశివపేట పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిట్ల నిఖిత ప్రేమ్ మాట్లాడుతూ.. పద్మశాలి ముద్దుబిడ్డగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ తొలి దశలో కీలకంగా పనిచేసిన నాయకుల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముందువరుసలో ఉన్నారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బాపూజీ అడుగుజాడల్లో యువత ముందుకు సాగుతూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, కౌన్సిలర్లు అరుణ్, షాజీ,నర్సిములు, నాయకులు వైద్యం పవన్, తుల్జారాం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పద్మశాలి సేవా సంఘం నాయకులు, సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు....

## ఎర్ర సాయిశ్రీకృతని సన్మానించిన గ్రాడ్యుయేషన్ అసోసియేషన్.




**సదాశివపేట :** పట్టణానికి చెందినఎర్ర వీరేందర్ గౌడ్ ఎర్ర శివ లీల దంపతుల కుమార్తె ఎర్ర సాయి శ్రీ కృతి ఎంబిబిఎస్ ఫ్రీ సీట్ (క్యాటగిరి ౹ా) సాధించడంతో సదాశివపేట గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సాయి శ్రీకృతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు విశాల్ మాట్లాడారు . విద్యార్థులు సంకల్ప భావంతో ఉన్నత చదువులు చదివి దేశానికి, తల్లిదండ్రులకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎర్ర పరమాత్మ గౌడ్, రాధాకృష్ణ, రామకృష్ణ, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భరత్ నగర్ అసోసియేషన్ వార్షికోత్సవం...

అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డిని సత్కరించిన మహేందర్ రెడ్డి



**హైదరాబాద్:** భరత్ నగర్ కాలనీ అసోసియేషన్ ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి తో పాటు సభ్యులను ఘనంగా సత్కరించి, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కూకట్పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి సంజీవరావు, సీనియర్ నాయకుడు కొండల్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, సంతోష్, శ్రీధర్ చారి, వనజ, స్వాతి, దీప్తి, మరియు అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ బండలో అభి ఇవి మోటార్స్ షోరూమ్ ప్రారంభించిన పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ...





**కూకట్పల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో నూతనంగా ఏర్పాటు చేసిన అభి ఇవి మోటార్స్ షో రూమ్ ను తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా గణేష్, ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

# ఎన్‌పీ ఎస్ స్వస్థ్య స్కీమ్

## పీఎఫ్ఆర్డీఏ కొత్త మార్గదర్శకాలివే




పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ).. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద ఎన్‌పీఎస్ స్వస్థ్య కోసం ఇటీవల కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలతో రిటైర్మెంట్ సేవింగ్స్‌కు పెద్దపీట వేస్తున్నది. అందుకే ఓ సూపర్ టాప్-అప్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరి. ఎన్‌పీఎస్‌కు అర్హత ఉన్నవారు ఎవరైనా పీఎఫ్ఆర్డీఏ షరతులు, మార్గదర్శకాలకు లోబడి ఎన్‌పీఎస్ స్వస్థ్యలో చేరవచ్చు. ఇందులో రెండు భాగాలుంటాయి. ఒకటి పెట్టుబడి ఖాతా, మరొకటి బీమా పాలసీ ఉంటాయి.

తొలి చందా తప్పనిసరిగా మొదటి సంవత్సరం బీమా ప్రీమియంను కవర్ చేసేలా ఉండాలి. ఎన్‌పీఎస్ స్వస్థ్య ఖాతాలో ఏటా కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడి కోసం చందా చెల్లించే ప్రతిసారి మీ ఖాతాకు కనీసం రూ.10 పెంచుకుంటూపోవాలి.

18-40, 40-60, 60-70 ఏండ్లవారికి వేర్వేరు ప్రీమియంలు. ప్రీమియం, పాలసీ షరతులకు లోబడి 85 ఏండ్లదాకా పొడిగించుకోవచ్చు. అలాగే హెల్త్ బెనిఫిట్ అడ్మినిస్ట్రేటర్ కోసం రూ.200 వార్షిక నిర్వహణ చార్జీ చెల్లించాలి. పన్నులు అదనం.

రూ.1 లక్ష, రూ.5 లక్షలు, రూ.10 లక్షలు, రూ.30 లక్షల ఆరోగ్య బీమా ఆప్షన్లుంటాయి. వీటికి ప్రీమియంలు వరుసగా రూ.10,000, రూ.50,000, లక్ష రూపాయలు, రూ.3 లక్షలుగా ఉంటాయి. కనీస కార్పస్ రూ.25,000.

పేర్కొన్న వైద్య ఖర్చుల కోసం పాక్షిక ఉపసంహరణలకు వీలుంటుంది. హెల్త్‌కేర్ విత్‌డ్రాయల్స్ కోసం ఎలాంటి వెయిటింగ్ పీరియడ్ ఉండదు. సాధారణ, ప్రీమెచ్యూర్ ఎగ్జిట్‌లతోపాటు, నగదు చెల్లించకపోతే, సబ్‌స్క్రైబర్ చనిపోతే ఎన్‌పీఎస్ స్వస్థ్య ఖాతా క్లోజ్ అవుతుంది.

స్టాండర్డ్ పాలసీలో ఫ్యామిలీ ఫ్లోటర్ కింద సబ్‌స్క్రైబర్‌తోపాటు, వారి భాగస్వామి, ఇద్దరు సంతానానికి (పిల్లలు) ఆరోగ్య బీమా కవరేజీ ఉంటుంది. సబ్‌స్క్రైబర్ తల్లిదండ్రులకు మాత్రం వర్తించదు.

## ఇంటి కోసం ఎంత?

### అర్హత, మారిన నిబంధనలు ఏమిటి?



ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) సభ్యులు ఇంటి సంబంధిత అవసరాల కోసం తమ ఈపీఎఫ్ ఖాతా నుంచి నగదును ఉపసంహరించుకోవచ్చు. ఇటీవలి ఈపీఎఫ్‌వో మార్గదర్శకాల ప్రకారం.. సభ్యత్వం పొంది ఏడాది దాటితే అందుబాటులో ఉన్న మొత్తం నిధిలో నిబంధనలకు లోబడి 75 శాతం వరకు వెనుకకు తీసుకోవచ్చు. ఈ సొమ్మును ఇంటి కొనుగోలు, నిర్మాణం, మరమ్మతులు, నవీకరణ, ఇప్పటికే ఉన్న గృహ రుణాన్ని తీర్చేందుకు వాడుకోవచ్చు. అలాగే ఈపీఎఫ్‌వో సంస్కరణల్లో భాగంగా మారిన నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులు తమ ఉద్యోగ జీవితకాలంలో గరిష్ఠంగా ఐదుసార్లు ఇంటి కోసం నగదు ఉపసంహరణలు చేసుకోవచ్చు.

### సరళతర విధానం

గతంలో ఉన్న 13 రకాల పాక్షిక ఉపసంహరణ నిబంధనలను ఇప్పుడు ఒకే సమగ్రమైన, సరళీకృత విధానంలోకి విలీనం చేశారు. మునుపు సభ్యుడు నగదు ఉపసంహరించుకుంటే ఉద్యోగి చందా, వడ్డీ ఆదాయంలో నుంచి మాత్రమే వచ్చేది. ఇప్పుడు సంస్థ చెల్లించే చందాలో నుంచి కూడా నగదును ఇస్తుండటం గమనార్హం. దీంతో మరింత నగదు చేతికి అందుతున్నది. అలాగే అనారోగ్యంబారినపడ్డ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం ఉపసంహరణలకు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి పరిమితులూ లేవు. మిగతా అవసరాలకు మాత్రం పరిమితులున్నాయి.

### మిగతా అవసరాల్లో..

వైద్య ఖర్చులు: వ్యక్తిగత లేదా కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల కోసం ఈపీఎఫ్ సభ్యులు ఖాతా నుంచి నగదును ఎన్నిసార్లైనా తీసుకోవచ్చు. అయితే ఈ మేరకు వర్తించే ఈపీఎఫ్ నిబంధనలకు లోబడి క్లెయిమ్‌ల పరిష్కారం ఉంటుంది. చదువుల ఫీజులు: తమ లేదా పిల్లల చదువు ఖర్చుల కోసం కూడా ఈపీఎఫ్ నగదును వెనుకకు తీసుకోవచ్చు. సభ్యత్వం కాలవ్యవధిలో 10సార్లు ఈ అవకాశం ఉంటుంది.

పెండ్లి కోసం: తమ లేదా అర్హులైన కుటుంబ సభ్యుల వివాహ ఖర్చుల నిమిత్తం సభ్యులు ఈపీఎఫ్ సొమ్మును తీసుకోవచ్చు. అయితే సభ్యత్వకాలంలో ఇందుకు ఐదుసార్లు మాత్రమే వీలున్నది.

ఇతరాలు: కేంద్ర ట్రస్టీల బోర్డు ప్రకటించిన ప్రత్యేక పరిస్థితుల్లోనూ ఈపీఎఫ్ అడ్వాన్స్‌ల కోసం సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే ఇందుకు అవకాశం ఉంటుంది.

హౌసింగ్ కోసం ఈపీఎఫ్ అడ్వాన్స్ ఎంత?
ప్రస్తుత ఈపీఎఫ్‌వో నిబంధనల ప్రకారం సభ్యులు తమ బ్యాలెన్స్‌లో 75 శాతం వరకు తీసుకోవచ్చు
అవసరాలు
ఇల్లు, ఫ్లాట్ లేదా స్థలం కొనుగోలుకు ఇంటి నిర్మాణానికిగృహ రుణం తీర్చడానికిమరమ్మతులు, ఇల్లు నవీకరణకు
అర్హత
ఈపీఎఫ్ సభ్యత్వం వచ్చిన 12 నెలల తర్వాత అర్హులు
ఎన్నిసార్లు?
సభ్యత్వ కాలంలో గరిష్ఠంగా ఐదుసార్లు
ఈపీఎఫ్‌వో మెంబర్ పోర్టల్ ద్వారా ఫామ్ 31 సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు

# నయా 'ఎఫ్‌డీ' క్రెడిట్ కార్డ్




ఎస్బీఐ కార్డ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఆధారిత సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులను పరిచయం చేసింది. ఎస్బీఐ యోనోపై ఇవి అందుబాటులో ఉంటాయి. కావాలనుకునే ఖాతాదారులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక వీటిలో ఎలైట్, ప్రైమ్, సింప్లీక్లిక్, సింప్లీసేవ్ అనే నాలుగు రకాల కార్డులున్నాయి. అయితే ఎలైట్, ప్రైమ్ కార్డులు ప్రీమియం కార్డ్ ఆప్షన్లుగా ఉన్నాయి. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ ప్రయోజనాలను కోరుకునేవారి కోసం సింప్లీక్లిక్, రోజువారి ఖర్చులు-ఆదా ప్రయోజనాల కోసం సింప్లీసేవ్ కార్డులను రూపొందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో ఎఫ్‌డీ ఖాతా ఉన్నవారు ఎస్బీఐ యోనో యాప్ ద్వారా ఈ సెక్యూర్డ్ అడ్వాంటేజ్ ఎస్బీఐ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తిగా పేపర్‌లెస్ అప్లికేషన్ ఇది. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంది. ఇక మీరు తీసుకునే క్రెడిట్ కార్డుకు సెక్యూరిటీగా మీ ఎఫ్‌డీ ఉంటుంది. కాబట్టి రెగ్యులర్ అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డుకు ఇది పూర్తిగా భిన్నం. సంప్రదాయ క్రెడిట్ కార్డులను బ్యాంకులు.. ఆయా కస్టమర్ల క్రెడిట్ స్కోర్, ఆదాయం, రుణ చెల్లింపుల చరిత్ర, ఇతరత్రా అర్హతల ఆధారంగా ఇస్తాయి. అయితే ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డుల మంజూరుకు ఇందులో దేన్నీ కూడా బ్యాంకులు చూడవు. మీరు చేసే ఎఫ్‌డీనే హామీగా మీకు ఈ క్రెడిట్ కార్డ్ వస్తుంది మరి. అయితే మీ ఎఫ్‌డీ ఆధారంగానే క్రెడిట్ కార్డ్ ఖర్చుల పరిమితి ఉంటుంది.

# గిల్, కోహ్లీ షో

## తొలి వన్డేలో భారత్ ఘనవిజయం

**సెంచరీలతో కదం తొక్కిన ప్రస్తుత, మాజీ సారథులు**

**మెరిసిన కుల్‌దీప్.. గ్రీవ్స్ పోరాటం వృథా**



**తిరువనంతపురం:** వన్డే ప్రపంచకప్ సన్నాహకాలను భారత్ ఘనంగా ఆరంభించింది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడుతున్న భారత్.. ఆదివారం తిరువనంతపురం వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రత్యర్థిపై 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదుచేసింది. 'ఛేదనలో మొనగాడు' విరాట్ కోహ్లీ (88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్స్‌లతో 139 నాటౌట్) కెరీర్‌లో 86వ (మూడు ఫార్మాట్లలో కలిపి) సెంచరీతో చెలరేగిన వేళ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (108 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 110) సారథిగా రెండో శతకాన్ని బాదడంతో విండీస్ నిర్దేశించిన 296 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 41.4 ఓవర్లలోనే రెండు వికెట్లే కోల్పోయి ఛేదించింది. మొదట కరీబియన్ జట్టుకు జస్టిన్ గ్రీవ్స్ (108 బంతుల్లో 12 ఫోర్లతో 101) సెంచరీ చేయగా జాన్ క్యాంప్‌బెల్ (62), అమిర్ జాంగూ (53 నాటౌట్) రాణించడంతో 295/7 స్కోరు చేయగల్గింది. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ (4/40)కు నాలుగు వికెట్లు దక్కాయి. అతడికే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈనెల 30న గువాహతి వేదికగా రెండో వన్డే జరుగుతుంది.

### తాజా, మాజీ కెప్టెన్ల జోరు

భారత టాపార్డర్ జూలు విదిల్చడంతో విండీస్ లక్ష్యం ఏమాత్రమూ సరిపోలేదు. తన మాజీ సారథులు రోహిత్ శర్మ (32), కోహ్లీతో కలిసి ప్రస్తుత కెప్టెన్ గిల్ రెచ్చిపోయాడు. ఇన్నింగ్స్‌ను నెమ్మదిగా ఆరంభించినా క్రీజులో కుదురుకున్నాక రోహిత్, గిల్ జోడీ జోరందుకోవడంతో ఆతిథ్య జట్టుకు శుభారంభమే దక్కింది. ఫోర్డే, అల్జారీ జోసెఫ్ ఓవర్లో డీప్ వికెట్ మీదుగా రోహిత్ కొట్టిన సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి. గిల్ సైతం బౌండరీలతో విరుచుకుపడగా పది ఓవర్లలో భారత్ వికెట్లేమీ నష్టపోకుండా 70 రన్స్ చేసింది. అయితే జోసెఫ్ 12వ ఓవర్లో బంతిని డీప్ స్కేర్ లెగ్‌లో ఆడబోయిన హిట్‌మ్యాన్.. ఆండ్రూ చేతికి చిక్కడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. అప్పటికే 40ల్లోకి వచ్చిన గిల్.. ఆ తర్వాత కోహ్లీ అండతో మరింతర రెచ్చిపోయాడు. ఛేజ్ ఓవర్లో సింగిల్ తీసి ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఇద్దరూ క్రీజులో సెట్ అయ్యాక విండీస్ బౌలర్లు, ఫీల్డర్లు వారి విన్యాసాలను దగ్గర్నుంచి చూడటం తప్ప వికెట్లు తీయాలన్న ఆలోచనే మరిచిపోయారా? అన్నట్టు వారి ఆట సాగింది. జోసెఫ్ బౌలింగ్‌లో కీపర్ తలమీదుగా సిక్స్‌తో పరుగుల వేట మొదలెట్టిన విరాట్.. 44 పరుగుల వద్ద ఉండగా అతడి బౌలింగ్‌లోనే సిక్స్‌తో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. ఆ తర్వాత జోసెఫ్ విసిరిన 29వ ఓవర్లో రెండు బౌండరీలు బాదడంతో వన్డేల్లో 'రన్ మిషీన్' 15వేల పరుగుల మార్కును అందుకున్నాడు. ఆ తర్వాతి ఓవర్లోనే భారత అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేస్తూ సీల్స్ ఓవర్లో బౌండరీతో వన్డేల్లో గిల్ 11వ శతకం పూర్తవడమే గాక భారత్ స్కోరూ 200 పరుగులు దాటింది. శతకం పూర్తయ్యాక గిల్ నిష్క్రమణతో 151 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. గిల్ వెళ్లేసరికే 80ల్లోకి వచ్చిన విరాట్.. రుతురాజ్ (13)ను అవతలి ఎండ్‌లో ఉంచి లాంఛనాన్ని ముగించే బాధ్యతలు భుజానికెత్తుకున్నాడు. లాంగాన్‌లో చూడముచ్చటైన సిక్స్‌తో శతకానికి చేరువైన అతడు 94 రన్స్ వద్ద గుడకేశ్ బౌలింగ్‌లో ముందుకొచ్చి మరోసారి లాంగాన్‌లోనే సిక్స్‌తో వన్డేల్లో 55వ సెంచరీని నమోదుచేశాడు. సెంచరీ తర్వాత జోరు పెంచిన కోహ్లీ.. సిక్స్‌లు, ఫోర్లతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### గ్రీవ్స్ రాణించినా..

విండీస్ ఇన్నింగ్స్‌లో ఆటంతా ఓపెనర్లదే. సిరాజ్, బుమ్రా వంటి ఫ్రంట్‌లైన్ బౌలర్లు లేని భారత బౌలింగ్‌ను క్యాంప్‌బెల్, గ్రీవ్స్ జోడీ ఉతికారేసింది. ఇద్దరూ మొదట్నుంచే దూకుడుగా ఆడటంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. బ్రార్, నితీశ్, ప్రసిద్ధ్.. ఏమాత్రం ప్రభావం చూపకపోయారు. రవీంద్ర జడేజా సైతం నిరాశపరిచాడు. అర్ధ శతకాల తర్వాత ఈ జోడీని 20వ ఓవర్లో ఎట్టకేలకు విడదీసిన కుల్‌దీప్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. క్యాంప్‌బెల్ ఔటయ్యాక విండీస్ ఇన్నింగ్స్ గాడి తప్పింది. కార్టీ (13)ని ప్రసిద్ధ్, కెప్టెన్ షై హోప్ (12)ను కుల్‌దీప్ పెవిలియన్‌కు పంపారు. నిలకడగా ఆడిన గ్రీవ్స్.. జడేజా బౌలింగ్‌లో సింగిల్‌తో తన వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని సాధించాడు. కానీ ఆ వెంటనే కుల్‌దీప్ బౌలింగ్‌లో వికెట్ల ముందు బలయ్యాడు. ఆఖర్లో అమిర్ మెరుపులతో పర్యాటక జట్టు మెరుగైన స్కోరు చేసింది.

### కోహ్లీ ఏ 15 వేలు

వన్డేల్లో కోహ్లీ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 57 పరుగుల వద్ద ఉండగా అతడు 15 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. తద్వారా ఈ ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ (18,426) తర్వాత ఈ ఘనత సాధించిన రెండో బ్యాటర్‌గా కోహ్లీ (15,080) రికార్డులకెక్కాడు.

9 ఈ మ్యాచ్‌లో కోహ్లీ కొట్టిన సిక్స్‌లు. ఒక వన్డే మ్యాచ్‌లో ఇన్ని సిక్స్‌లు కొట్టడం అతడికి ఇదే ప్రథమం. శ్రీలంకపై 8 సిక్స్‌లు బాదాడు. 10 వెస్టిండీస్‌పై కోహ్లీ సెంచరీల సంఖ్య. ఒక జట్టుపై అత్యధిక సెంచరీలు చేసిన వారిలో అతడిదే అగ్రస్థానం. గతంలో శ్రీలంకపైనా ఈ ఘనత సాధించాడు. సచిన్, రోహిత్ (ఆస్ట్రేలియాపై 9) తదుపరి స్థానాల్లో ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు
వెస్టిండీస్: 50 ఓవర్లకు 295/7 (గ్రీవ్స్ 101, క్యాంప్‌బెల్ 62, కుల్‌దీప్ 4/40, ప్రసిద్ధ్ 2/60); భారత్: 41.4 ఓవర్లకు 300/2 (కోహ్లీ 139నౌ, గిల్ 110, ఛేజ్ 1/64, జోసెఫ్ 1/81)

స్పోర్ట్స్

## అబ్బాయిలకు వెండి.. అమ్మాయిలకు కాంస్యం




**సమర్‌కండ్:** ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్ ఈసారి రజతంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఓపెన్ సెక్షన్ ఆఖరి రౌండ్ తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్.. హంగేరితో మ్యాచ్‌ను 2-2తో డ్రాగా ముగించింది. ఉజ్బెకిస్థాన్ జట్టు తమ చివరి మ్యాచ్‌లో 2.5-1.5తో ఉక్రెయిన్‌పై గెలిచి స్వర్ణం నెగ్గింది. ఆ జట్టు ఖాతాలో మొత్తంగా 20 పాయింట్లుండగా భారత్ 18 పాయింట్లతో నిలిచింది. ఇక అమ్మాయిల విభాగంలో 3-1తో చైనాను ఓడించినా కాంస్యంతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. విమెన్స్ కేటగిరీలో చైనాకు గోల్డ్, కజకిస్థాన్‌కు సిల్వర్ దక్కాయి.

## ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లా?..

## ఆసియా క్రీడల నిర్వాహకులపై సింధు ఫైర్..!

ఆసియా క్రీడల్లో పతకం గెలవాలనుకున్న పీవీ సింధ కల చెదిరింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిందీ తెలుగు తేజం. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్ యుఫీ(చైనా) చేతిలో కంగుతిన్న సింధు నిర్వాహకులపై మండిపడింది. ఒక్కరోజులో మూడు మ్యాచ్‌లు ఏంటీ? అసలు ఇదేం షెడ్యూల్? అంటూ ఫైర్ అయిందీ ఒలింపిక్ విజేత. అంతేకాదు కోర్టులో రివ్యూ కెమెరాలు లేకపోవడాన్ని కూడా సింధు తప్పుపట్టింది. జపాన్‌లోని ఐచీ నగోయలో జరుగుతున్న 18వ ఆసియా క్రీడల్లో పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సింధు క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ఆదివారం చైనా షట్లర్ చెన్ యుఫీపై 21-11తో తొలి సెట్ గెలుపొందిన సింధు ఆ తర్వాత తడబడింది. నాలుగో సీడ్ ధాటికి వరసగా రెండు సెట్లను 18-21, 10-21తో కోల్పోయిన తెలుగుతేజం టోర్నీ నుంచి వైదొలిగింది. అయితే.. బిజీ షెడ్యూల్ కారణంగా సరిపోను మ్యాచ్ సన్నద్ధత లేకపోవడం వల్లనే తాను ఓటమి పాలయ్యానని సింధు వాపోయింది. భారత స్టార్ ఒక్క రోజులనే మూడు మ్యాచ్‌లు ఆడింది. శనివారం ఉదయం 12:07 గంటలకు రెండో మ్యాచ్ ఆడిన తను.. ఆదివారం చెన్ యుఫీతో క్వార్టర్ ఫైనల్ కోసం కోర్టుకు వచ్చేసింది. దాంతో.. తీరిక లేకుండా ఆడడం, నిద్ర లేకపోవడానికి తోడు సరైన నిర్వహణ లోపించడం కారణంగా పతకం చేజారిందని సింధు తెలిపింది.



## ‘ఆదర్శకుటుంబం’ వేరే లెవెల్

‘దాదాపుగా 20ఏళ్ల తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పనిచేశాను. తను రచన చేసిన నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలు క్లాసిక్ లవ్‌స్టోరీలుగా నిలిచాయి. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత నాకోసం అద్భుతమైన కథను తెచ్చారు త్రివిక్రమ్. ఇందులో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ఊహించని ట్విస్టులుంటాయి. ట్రీట్మెంట్ కొత్తగా ఉంటుంది. ‘ఆదర్శకుటుంబ’ మామూలు కుటుంబం కాదు. ఇది వేరే లెవెల్. త్రివిక్రమ్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. మీరు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు’ అని అగ్ర కథానాయకుడు వెంకటేశ్ నమ్మకం వెలిబుచ్చారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47 --ూఖ 47’. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈసినిమాలోని తొలి పాట ‘నారాయణమ్మ..’ను మేకర్స్ విడుదల చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ ‘వెంకటేశ్‌గారి ‘పవిత్రబంధం’ సినిమాతో నా సినీప్రయాణం మొదలైంది. ‘నువ్వునాకు నచ్చావ్’తో మా బంధం బలపడింది. అందుకే ఆయనకు నేనెప్పుడూ కృతజ్ఞుడినై ఉంటా. ఈ పాట రామజోగయ్య అద్భుతంగా రాస్తే, అంతే అద్భుతంగా తమన్ స్వరపరిచారు. వెంకటేశ్‌గారితోపాటు శ్రీనిధిశెట్టి, డింపుల్ హయాతి, నివేద పేతురాజ్ పాటకు అందాన్ని తెచ్చారు. సినిమా కలర్‌ఫుల్‌గా ఉంటుంది’ అని తెలిపారు.

## రామాయణ దృశ్యమాలిక





ఎన్నిమార్లు విన్నా.. ఎన్నిసార్లు కన్నా.. తనివితీరని పుణ్యగాథ ‘రామాయణం’. అది మన దేశ సంపద. మన అస్తిత్వానికి ప్రతీక. అందుకే.. ఎన్నిసార్లు తెరకెక్కినా ఈ దృశ్యకావ్యాన్ని చూసేందుకు జనం సిద్ధంగానే ఉంటారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో దాదాపు 3వేల కోట్ల భారీ నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా ‘రామాయణం’ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. నితీశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈచిత్రంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తుండగా, రావణబ్రహ్మగా ‘కేజీఎఫ్’ఫేం యశ్ కనిపించనున్నారు. తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈసినిమా ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఆదివారం ఈ సినిమా నుంచి రెండు పోస్టర్లను విడుదల చేశారు. అందులో తొలి పోస్టర్ సీతారామలక్ష్మణులది కాగా, రెండో పోస్టర్ రావణబ్రహ్మది. వనవాసకాలంలో సీతాలక్ష్మణ సమేతంగా ధనుర్బాణాలతో కనిపిస్తున్న రామచంద్రమూర్తిని తొలిపోస్టర్‌లో చూడొచ్చు. రాముడిగా రణబీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇక సర్వాలంకారభూషితుడైన రావణబ్రహ్మగా యశ్‌ని రెండో పోస్టర్‌లో చూడొచ్చు. మహాశక్తివంతుడు, బ్రహ్మజ్ఞాని, లంకాధీశుడైన రావణుడ్ని ఈ పోస్టర్‌లో అద్భుతంగా ఆవిష్కరించారు. ఇందులో రావణపత్ని మండోదరిగా కాజల్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్న విషయం తెలిసిందే.

## ఆ రోజే నిజమైన డాటర్స్ డే



“ఆడవాళ్లకు నిజమైన స్వాతంత్ర్యం అంటే నేను నమ్మేది ఏంటంటే... ఒక ఆడపిల్ల రాత్రి పూట ఒంటరిగా నడవగలిగిన రోజు, చీకటి పడ్డాక పార్కులో కూర్చోగలిగిన రోజు, తనకు నచ్చిన దుస్తులు ధరించగలిగిన రోజు, ఎలాంటి భయం లేకుండా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉపయోగించగలిగిన రోజు, అలానే పబ్లిక్ ప్లేస్‌లో ఉన్నప్పుడు ఎలాంటి ప్రమాదం పొంచి ఉందో అని ఆలోచించని రోజు... నిజమైన ‘డాటర్స్ డే’. ఆ రోజునే మనం నిజమైన డాటర్స్ డేని జరుపుకోవాలి” అని కృతీ సనన్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఆదివారం ‘డాటర్స్ డే’ని పురస్కరించుకుని ఆమె ఈ విధంగా అన్నారు. ఇంకా సమాజంలో ఆడపిల్లల భద్రత గురించి ఆమె షేర్ చేసుకున్న కొన్ని విషయాలు ఈ విధంగా... “మీ కూతురు మీకు ఫోన్ చేసి ‘నన్ను కొందరు పురుషులు వెంబడిస్తున్నట్లు అనిపిస్తోంది’ అని చెబుతున్నట్లు ఊహించుకోండి, రాత్రిపూట ఒంటరిగా నడుస్తూ, భయంతో వెనక్కి తిరిగి చూసుకోవడం... ఇంటికి చేరేలోపే మీ కూతురి ఫోన్ స్విచ్ఛాఫ్ అయిపోవడం... ఇలాంటి పరిస్థితులను ఒక్కసారి ఊహించుకుని చూడండి... వీటి గురించి లోతుగా ఆలోచించండి. అప్పుడు మన ఆడపిల్ల భద్రత లేని సమాజంలో ఉన్న విషయం ఇంకా బాగా అర్థం అవుతుంది. ఆడపిల్ల ఇంటికి క్షేమంగా చేరిన తర్వాత కుటుంబ సభ్యులకు ‘నేను ఇంటికి వచ్చేశాను’ అని ఫోన్ చేసి చెప్పాల్సిన అవసరం లేని రోజు రావాలి. అలాంటి సురక్షితమైన ప్రపంచాన్ని కూతుళ్లకు అందించాల్సిన బాధ్యత మన మీద ఉంది. ఆడపిల్ల బయటకు వెళ్లినప్పుడు లైవ్ లొకేషన్ షేర్ చేయడం, పెప్పర్ స్ప్రే వెంట తీసుకెళ్లడం, నడవడానికి బదులుగా క్యాబ్ బుక్ చేసుకోవడం, కేవలం సేఫ్‌గా భావించడం కోసం ఎవరికైనా ఫోన్ చేయడం... ఇవన్నీ కూడా తన జీవనశైలిలో భాగం చేసుకునేలా మనమే ఆమెను బలవంతం చేశాం” అంటూ కృతీ సనన్ షేర్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. కృతి చెప్పినది అక్షరాలా నిజం అని కొందరు, ఆడపిల్లల భద్రత విషయంలో ప్రపంచం చాలా మారాలని కొందరు నెటిజన్లు స్పందించారు.

## ప్రేమతో కూడిన హృదయం



తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో టాలీవుడ్ ఫిల్మ్ మేకర్ పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ‘స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్’. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సినిమా ప్రచారాన్ని మేకర్స్ వేగవంతం చేశారు. తాజాగా ఇందులో కీలకపాత్ర పోషిస్తున్న జరీనా వహాబ్ ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ‘ప్రేమతో కూడిన హృదయం.. పోరాటాలతో నిండిన జీవితం’ అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో పొందుపరచిన క్యాప్షన్ జరీనా వహాబ్ పాత్రపై, ఈ సినిమా కథపై ఆసక్తిని పెంచింది. ఇందులో ఆమె జుబైదాగా కనిపించనున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా, దునియా విజయ్ విలన్‌గా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: సామ్ కె.నాయుడు, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: పూరీ జగన్నాథ్, చార్మీకౌర్, జె.బి.నారాయణ్‌రావు కొండ్రోళ్ల, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com